

# శ్రీ హనుమత్ జ్ఞానపుష్పాలు

సంపుటి - 1 **డిజిటల్ మాస పత్రిక** సంచిక - 1

**శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల జీవన స్వీయజ్ఞాన కరదీపిక**



**శ్రీ గురుధాం ధర్మక్షేత్రం**

**సద్గురు శివానందమూర్తి భగవానులవారు**

**జూన్ 2026**

**శ్రీ శివానందగురు ఎడ్యుకేషనల్ & కల్చరల్ ట్రస్ట్ - బలుసుపాడు**

# శ్రీ హనుమత్ జ్ఞానపుష్పాలు

## డిజిటల్ మాసపత్రిక - జూన్ 2026

### శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల జీవన స్వీయజ్ఞాన కరదీపిక

సంపుటి-1 సంచిక - 1

ప్రకాశకులు

శ్రీగురుధామ్, బలుసుపాడు, జగ్గయ్యపేట, ఎన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్


**ఓంనమోభగవతే శ్రీశివానందాయ**

**శ్రీహనుమ జయహనుమ శివానంద హనుమ**

నమస్తే పద్మనాభాయ నమోహృత్పద్మవాసినే
పద్మాసనస్తదేవాయ శివానందాయతే నమః

## ఈ సంచికలో....


| | |
|---|---|
| ఆధ్యాత్మిక దివ్యధామం... శ్రీ గురుధామ్ ధర్మక్షేత్రం | 3 |
| సందేహ నివారణ | 4 |
| అమృత గుళికలు - ఆధ్యాత్మిక రత్నాలు | 5 |
| శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల ఉగాది సందేశం | 7 |
| శ్రీ పరాభవ నామ సంవత్సర శ్రీరామనవమి పర్వదినం | 11 |
| కాల సంకటాలను హరించే హనుమజ్జయంతి | 14 |
| కాలాతీతస్థితి - ఎరుక | 22 |
| అపార్థం, అనుమానం పోతే ఉండేది ఆత్మజ్ఞానమే | 27 |
| ప్రశ్నించుకునే విధానం | 31 |
| విచారణా స్రవంతి | 38 |
| ఓం నమో భగవతే శ్రీశివానందాయ | 39 |


**కళ్లు మూస్తే దైవాన్ని స్మరించు - కళ్ళు తెరిస్తే దేశాన్ని సేవించు**

FOR PRIVATE CIRCULATION ONLY

# ఆధ్యాత్మిక దివ్యధామం...
# శ్రీ గురుధామ్ ధర్మక్షేత్రం

శ్రీగురుధామ్ ధర్మక్షేత్రం భక్తి, జ్ఞాన, వైరాగ్య సమ్మిళితమైన ఒక ఆధ్యాత్మిక కేంద్రం. శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదంపతుల సంకల్పంతో సాకారమైన ఒక దివ్యధామం. సగుణ, నిర్గుణోపాసనలకు వేదికగా నిలిచే ఒక సాధనాలయం. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు వేదికగా నిలిచే ఒక అద్భుత దేవాలయం. అపర శివస్వరూపులైన సద్గురు శ్రీ శివానందమూర్తి భగవానులవారి నిలువెత్తు సజీవమూర్తి ప్రతిష్టతో జరిగిన అంకురార్పణ కాలగమనంలో వటవృక్షమై శాఖోపశాఖలుగా విస్తరిస్తూ బహుముఖ పవిత్రకార్యకలాపాలకు ఆలవాలమై విలసిల్లుతూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక, సాహిత్యపరమైన సేవా కార్యక్రమాలకు ఊపిరిలూదుతున్నది. వేదపండితుల వైదిక క్రతువులు మొదలుకొని సామాన్య భక్తుల భజనల వరకూ, జ్ఞాన పిపాసుల ధ్యానం మొదలుకొని సంప్రదాయ జపతపాల వరకూ, ముముక్షువుల సాధనలు మొదలుకొని సామాన్య గ్రామీణుల పూజల వరకూ, తాత్విక చింతన మొదలుకొని మూర్తి ఆరాధన వరకూ కాదేదీ ఆధ్యాత్మికతకు అనర్హం అని బోధించి నిరూపించే భారతీయ హృదయానికి సాకార సాక్షీభూతంగా  నిలుస్తూ దర్శించిన వారికి, ఆశ్రయించిన వారికి, ఆరాధించిన వారికి, వారివారి జీవోన్నతికి అవసరమైన అడుగులు వేయిస్తున్నది.

భౌతిక, అధిభౌతిక, ఆధ్యాత్మిక తాపాలను తీర్చి తాపత్రయోపశమనం కలిగించే ఈ దివ్య గురుసన్నిధానం జగజ్జీవేశ్వర భావాలను హృదయంలో లయించేసే ఒక జ్ఞానాలయంగా నిలుస్తున్నది. శైశవదశ మొదలుకొని శిరస్సులు పండిన వృద్ధాప్యం వరకూ వయో భేదాన్ని, మనోపరిపక్వతను, జీవపరిణితిని బట్టి  పరమపథ సోపానంగా నిలిచే  ద్వైతాద్వైతవిశిష్టాద్వైత సమ్మిళితమైన జ్ఞానబోధతోపాటు, జీవనంలో సుఖశాంతులనిచ్చే సంస్కృతీసంప్రదాయాల విజ్ఞానబోధను కూడా అందిస్తూ తరింపచేస్తున్నది. నిత్యజీవన గమనంలోనే ధర్మార్థకామమోక్షాలనే పురుషార్థాలను అనుసరింపచేసే సహజసాధనాలయమే శ్రీగురుధామం.

## సందేహ నివారణ

### దేహాత్మభావన జీవనం కోసమే... ధ్యానం కోసం కాదు

**ప్రశ్న : దేహాత్మభావనను వదలుకోవడం కష్టంగా ఉంది. ఎలా?**

**శివశ్రీ రమణ గురుదేవులు :** ఒక వ్యక్తి ఉద్యోగరీత్యా కార్యాలయానికి వెళ్లేప్పుడు అతడు అధికారిగా వ్యవహరిస్తాడు. అక్కడ అతనికి ఆ గుర్తింపు, హోదా అవసరం. కానీ ఇంట్లో కూడా అదే హోదాతో జీవించడు కదా! ఇంట్లో భర్తగా, తండ్రిగా వ్యవహరిస్తాడు. అలానే కార్యాలయంలో ఈ గుర్తింపులతో పనిలేదు. ఈ గుర్తింపులు ఆయా వ్యవహారాలకోసమే తప్ప తాను ఒంటిరిగా ఉన్నప్పుడు ఈ గుర్తింపులేవీ అవసరమే లేదు. ఎక్కడ అవసరాన్ని బట్టి అక్కడ ఆ గుర్తింపుభావంతో ఉండటం, అవసరం లేనప్పుడు ఆ గుర్తింపులు ఏవీ లేకుండానే ఉండటం, జీవనంలో మనం అనునిత్యం చేస్తున్నదే. ఆ గుర్తింపులన్నీ అవసరం లేనప్పుడు కేవలం జ్ఞాపకాలుగా మనసులో ఉంటాయి అంతే. అలానే మన ఆత్మ జీవనం కోసం దేహాత్మభావంతో మనసుగా వ్యవహరిస్తుంది. ఇక్కడ మనసుకూడా జీవనం కోసమే ఒక ప్రత్యేక గుర్తింపులాంటి ఈ దేహాత్మభావాన్ని ఆలంభనగా చేసుకుంటుంది. కానీ గాఢనిద్రలోనూ, ఏదైనా పనిలో తీవ్రంగా నిమగ్నమైనప్పుడూ ఆ గుర్తింపు ఉండటం లేదని తెలుస్తూనే ఉంది. దేహాత్మభావం కూడా ఆయా జీవన అవసరాలకోసం ఒక హోదాలాగా జ్ఞాపకంలో ఉన్నదే కానీ శాశ్వతంగా ఉండటంలేదు. ఈ విషయాన్ని మనం కొద్ది వివేకంతో విచారిస్తే తెలుస్తుంది. వ్యక్తికి ఇంట్లో అధికారిగా, కార్యాలయంలో భర్తగా, తండ్రిగా వ్యవహరించాల్సిన అవసరంలేదని ఎలా అయితే స్పష్టత ఉంటుందో... మనసు కూడా ఆయా సందర్భాల్లో జీవనం కోసం దేహాత్మ భావంతో ఉన్నా... అవసరం లేనప్పుడు అదే ఆ భావాన్ని సరళంగా త్యజిస్తుందని విచారణలో గుర్తించవచ్చు. ఇక్కడ జరిగేది ఆయా హోదాలను వదులుకోవడం కాదు... అవి శాశ్వతంగా ఉండటంలేదని, ఒకదానికొకటి అడ్డుకాదని గుర్తించడం. కార్యాలయంలో అధికారి హోదాలాగా జీవనంలో దేహాత్మభావనతో జీవించినా అది కేవలం ఒక జ్ఞాపకం మాత్రమే అని గుర్తిస్తే ధ్యానజీవితానికి అది అవరోదం కాదని తెలుస్తుంది. ఈ అవగాహన చేసుకున్న మనసు నిశ్చింతగా ఉంటుంది. అదే మనసుకు సహజధ్యానంగా నిలుస్తుంది.

## అమృత గుళికలు - ఆధ్యాత్మిక రత్నాలు

### శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల సందేశాలు

- నేనున్నట్లు తెలియడం తొలిపరమాత్మ స్మరణ
  నేనులేకుండా జీవించడం నిత్య పరమాత్మ స్ఫురణ

- కర్తృత్వం స్థానంలో ధర్మం వస్తే
  సుఖదుఃఖాలస్థానంలో శాంతి వస్తుంది

- ప్రయత్నం చేయడం కంటే
  ప్రయత్నపరుడిని అర్థం చేసుకుంటే
  సాధనతో పనిలేని సిద్ధి లభిస్తుంది
  ఉనికిగా ఉండి ఊరకుండుటయే
  జ్ఞానసిద్ధి....నిజమైన శరణాగతి

- ఆధ్యాత్మిక అనుభూతులు ఆశ పెరగడానికి కాదు
  అనుభవం కాలేదనే అనుమానం పోవడానికి

- దైహికమైన మరణాన్ని తప్పించుకోలేము
  సత్యం సంపూర్ణంగా అర్థమైతే
  మరణభావాన్ని, మృత్యుభయాన్ని అధిగమించవచ్చు

- నీకు ఏది తెలియాలన్నా ముందు జరగాల్సింది నీకునువ్వు తెలియడం
  దేనిపైనా ఆధారపడకుండా చేయగలిగింది నిన్నునువ్వుతెలుసుకోవడం

- సృష్టి క్రియలకు అహంకారం అక్కర్లేదు
  అహంకారం ఎప్పటికీ ఒక క్రియ కాదు
  అహంకార రహిత మనసే సహజధ్యానం

- తెలియబడేది అంతా కర్మ - తెలుసుకునేది పరమాత్మ

❖ ఫలంకోసం మనసు కదలని సహజస్థితే మౌనం...
అదే భగవాన్ చెప్పే ఊరకుండటం

❖ ఊరకుండాల్సింది ప్రాపంచిక జీవనంలో కాదు
పారమార్థికంగా మనసుకోరే ఫలాల విషయంలో

❖ ఉన్నానని తెలియడం చైతన్యం
ఉన్నది తెలియడం జ్ఞానం
ఉండటం సహజధ్యానం



శ్రీగురుధాం ధర్మక్షేత్రంలో కంచి కామకోటి పీఠాధీశ్వరులు
**శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి మహాస్వామి వారి సందర్శనం**
(ది. 19. 05. 26, మంగళవారం)

శ్రీరామ

శ్రీ శివానంద గురుభ్యోన్నమః

# శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం

## శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల సందేశం

నేడు ఉగాది పండుగ. ఈ సంవత్సరం పరాభవ నామ సంవత్సరం. పరాభవం అంటే వ్యక్తిగతమైన అవమానం కాదు. అహంకారానికి జరిగే విఘాతం. సత్యాన్ని గుర్తించకుండా అహంకారంతో పేట్రేగిపోతున్న మనుషులు, మనస్సులకు ఈ సంవత్సరాది నుండి రానున్న 6 సం.ల కాలంలో ఈ పరాభవం ప్రభావం ఉంటుంది. ఇది అహం చేతిలో అహంకారానికి పరాజయం జరిగే సమయం. ఇది విశ్వ మనస్సుకు (ప్రకృతి మేధస్సుకు), వ్యక్తిగత మనస్సుకు మధ్య జరిగే పోరాటం. సర్వేసుజనాః సుఖినో భవంతు! సర్వేజనాః సుజనా భవంతు!! అన్న సద్గురు శ్రీశివానందమూర్తి భగవానుల నవీన ఆధ్యాత్మిక నినాదం వాస్తవరూపాన్ని తీసుకునే కాలం ఈ ఉగాది నుండి గోచరిస్తుంది. మంచివాళ్లంతా సుఖంగా ఉండాలి!




శ్రీగురుధాం ధర్మక్షేత్రంలో ఉగాది పర్వదినం (ది. 19.03.26, గురువారం)

అందరూ మంచివాళ్లు అవ్వాలి, అన్న వారి సంకల్పం సమీప భవిష్యత్‌దీతిజిజిలో నెరవేరబోతుంది. దేశంలో ధర్మపరమైన మార్గనిర్దేశం చేస్తూ సనాతన ధర్మ వైభవం కోసం ఎదురుచూస్తున్న వ్యక్తులు, సంస్థలు, వ్యవస్థలు వారు తాము కంటున్న కలలను నిజం చేసుకునే సమయం ఆసన్నమైంది.

ఈ ఉగాది నుండి కేవలం ఒక దేశం, ఒక ప్రాంతానికి మాత్రమే కాదు... యావత్ ప్రపంచానికి, ప్రపంచంలో ఉన్న మానవాళికి ఈ సూచన వర్తిస్తుంది. భూమినుండి లభించే అన్ని వనరులపైనా ప్రకృతి ప్రభావం ఉండబోతుంది. లోహాలలో బంగారం మొదలుకొని ఇనుము వరకూ, రత్నాలు మొదలుకొని రాళ్లవరకూ, ఖనిజాలు మొదలుకొని కనీస ఇంధనాల వరకూ, మనిషికి చికిత్సచేసే మందులు మొదలు మొక్కలను రక్షించే ఎరువుల కొరత మరియ కోతల ప్రభావం మనిషి ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇదంతా మనిషి తన వ్యక్తిగత అహంకారం యొక్క పరిధిని గుర్తించే దిశగా ప్రకృతి అడుగులు పడబోతున్నాయన్నది నా అంచనా. ప్రపంచంలో దేశాధినేతలు, పాలకులు, నాయకులు, ఉన్నతాధికారులు, ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న పెద్దలు, ధార్మిక సంస్థల్లోని ముఖ్య వ్యక్తులు... ఇలా ప్రతి ప్రభావిత వర్గంపైనా ప్రమాద సూచనలు ఉన్నాయి. ఆహారధాన్యాలు మొదలుకొని ముడి సరుకుల వరకూ, పంటల నుండి ఫలాలవరకూ, పంచభూతా ద్వారా వొనగూరే ప్రతి ప్రయోజనం విషయంలో ఈ కొరత, కోత ఉండబోతుంది. ఈ కాలం ప్రతిఒక్కరూ కడు జాగ్రత్త వహించాల్సిన సమయం. ఈ కాలంలో పూర్తిగా ధర్మాన్ని ఆశ్రయించి ఆచరించిన వారికి మాత్రమే రక్షణ లభించే అవకాశం కనిపిస్తుంది. అంటే ప్రకృతి సంపద యెడల, పరమాత్మ సంపద యెడల గౌరవభావంతో పరిరక్షించే వారికే రక్షణ లభించే పరిస్థితిని చూడబోతున్నాం. అంటే పాడిపంటలు, పర్యావర ణాన్ని, పరమాత్మకు ఇష్టమైన పవిత్ర స్థలాలను, అక్కడి ఆధ్యాత్మిక సంపదల ఉనికికి భంగం కలిగించినా, పారమార్థిక దృష్టి ఉన్న మహాత్ములకు, గురుతుల్యులైన పెద్దలకు, ధర్మాచరణలో ఉన్న మహనీయుల మనసుకు కష్టం కలిగించినా, ఇతరుల ధన, మాన, ప్రాణాలకు హాని కలిగించినా... వారికి మాత్రం పరాభవం తప్పదు. ఇది మరో రకంగా చూస్తే పరాభవం కాదు... మానవ జీవన పరివర్తనకోసం వచ్చిన

ప్రభోదమే. దీన్ని కలియుగాంతంగా కాక కల్మషాంతంగా తీసుకోవాలి.

ముఖ్యంగా ఉగాది (19.03.26) నుండి మార్చి 25వరకూ, ఏప్రిల్ 12 నుండి ఏప్రిల్ 17 వరకూ, మే 22 నుండి మే 23 వరకూ, 2026 సెప్టెంబర్ 19, 2027 మార్చి 19 తేదీల్లో  అన్ని రకాలుగా జాగ్రత్తగా ఉండాల్సిన సమయం. భవిష్యత్‌లో ముఖ్యంగా 2031 జూన్ 6, 2032 జూన్ 27 తేదీలు, ఈ మధ్యకాలం అత్యంత ప్రమాద ఘంటికలను సూచిస్తున్న సమయం. ఈ ప్రత్యేక తేదీల్లో భౌగోళికంగా పెను విపత్తులు సంభవించే సూచనలు ఉన్నాయి. ప్రవాస భారతీయులు, ముఖ్యంగా అమెరికాలో ఉన్నవారు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. వివేకంతో సరైన కాలంలో సరైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం. ధర్మాచరణలో ఉండటం, దైవనామస్మరణ చేయడం, పరమేశ్వర ఆరాధన, ఓం నమో భగవతే రుద్రాయ మంత్రాన్ని పఠించడం వంటి కార్యాచరణతో ఈ కష్టాల నుండి ఉపశమనం లభిస్తుంది. దేశంలోని దక్షిణాదిలో తెలుగురాష్ట్రాలు, కేరళ, తమిళనాడు కర్నాటక, ఉత్తరాదిలోని పంజాబ్, హిమాలయాలు, ప్రపంచంలో నేపాల్, చైనా, అమెరికా వంటి దేశాలపై దుష్ప్రభావం అధికంగా ఉంటుంది. అక్కడ నివసించేవారు జాగ్రత్తగా ఉండాల్సిన సమయం. ప్రపంచవ్యాప్తంగా కమ?యనికేషన్ వ్యవస్థ విఫలం కావడం, సాంకేతిక పరమైన ఇబ్బందులే కాక ఆ సాంకేతికత ద్వారా ప్రమాదాలు సంభవించడం, వాతావరణంలో పెనువిపత్తులు, ముఖ్యంగా సూర్యుడిలో మార్పులు, మన చుట్టూ ఆవరించిన గాలిలోని వాయువులు కూడా ప్రమాద కారకాలుగా మారటం వంటివి సంభవించనున్నాయి. పెనువిప్లవాలు, నూతన ఆవిష్కరణలు సంభవించే కాలం ఇది. పరాభవ నామ సంవత్సరం అంటే వినాశంగా కనిపించే పరివర్తనకు నాంది పలికే సంవత్సరం. ఈ ఏడాదిలో భౌతిక పరిధిలోని ప్రతి అంశము వివాదంగా, ఘర్షణగా, యుద్ధంగా పరిణమించే పరిస్థితులు నెలకొంటాయి. మానవాళి  ఉపయోగించే ప్రతి విషయంలోనూ వనరుల పరంగా ఇబ్బందులు రాబోయే సమయం ఇది. ఏ విషయంలోనైనా పరిధిలేని అపరిమితమైన వివాదాలు, ఘర్షణలకు అవకాశం ఏర్పడబోతుంది.

కేవలం అధీకృతమైన వ్యక్తులే కాక దేశభక్తి పరాయణులు, ధార్మికమైన వ్యక్తులు మన సనాతన ధర్మంలోని నైతికత, కృతజ్ఞతల విషయంలో విస్తృత ప్రచారం చేయాల్సిన సమయం ఇది. దేశాల మధ్యలో అణుయుద్ధాలే కాదు... మనిషి శరీరంలో కూడా అంతర్గతంగా కణ యుద్ధం జరిగే గడ్డుకాలమిది. ముఖ్యంగా మనిషి శరీరంలోని మెదడు, గుండె వంటి కీలక భాగాలపై వీటి ప్రభావం ఉంటుంది. వృద్ధులు, యువతపై అధికంగా దుష్ప్రభావం ఉంటుంది. మహానగరాలు మొదలుకొని మురికి వాడల వరకూ, ఆకాశహర్మ్యాలు మొదలుకొని అతి నిరుపేద పూరిగుడిసెల వరకూ ఎవరినీ వదలకుండా దుష్ప్రభావాలు కనిపిస్తాయి. అన్ని రంగాలలోనూ సామాన్యులకన్నా మాన్యులైన వారిపై అధిక ప్రభావం ఉంటుంది. మనిషి తన అల్ప శక్తిని కాక సృష్టిలోని మహాశక్తిని, తన మనోశక్తిని కాక విశ్వమంతా ఉన్న పరాశక్తిని గుర్తుపట్టే సమయం ఇది. ఆధ్యాత్మిక పెనువిప్లవానికి, మార్పులకు ఇది నాందీకాలం. ఆహార నిల్వలు, ఆధ్యాత్మిక విలువలను కాపాడుకోవాల్సిన ఒక సంక్లిష్టమైన సమయాన్ని రాబోయే ఈ ఆరేళ్లలో చూడబోతున్నాము. దానికి ఈ పరాభవ నామసంవత్సరం ఒక శుభారంభంగా నిలవబోతుంది. మనిషికి ధర్మాచరణమే శరణ్యం అనిపించే విధంగా ఈ పరాభవ నామసంవత్సరం ఉండబోతుంది. ఇది పరాభవంగా కనిపించే పరివర్తననామ సంవత్సరం. ఒక శుభ పరిణామ ఆరంభ సంవత్సరం. ప్రాంతాలు, రాష్ట్రాలు, దేశాలు అనే తేడాయే లేకుండా మాన్యుడు మొదలుకొని సామాన్యుడి వరకూ, కాషాయం మొదలుకొని ఖద్దరు వరకూ ప్రభావం చూపబోయే ఈ పరాభవ నామ సంవత్సరంలో దైవం, ధర్మమే శరణ్యం కాబోతుంది. ఈ భవిష్యసూచనలు భయపెట్టడానికి కాదు జాగ్రత్త పడటానికి మాత్రమే. కేవలం పంచాగాన్నే కాక పరమాత్మను ఆశ్రయించి త ధర్మం, పవిత్రత, నైతికతల వైపు దృష్టిసారించడానికి ఇదొక శుభసూచకమైన సమయం. ఇది మనందరం మేలుకోవాల్సిన సమయం, మేలు కోరాల్సిన సమయం, ఉగాది ఆశించేది కాదు.... అందించేది కావాలి. ఉగాది కేవలం సందేశంగా కాదు... సహకారంగా... సహాయంగా ఉండాలి.

శ్రీరామ

శ్రీ శివానంద గురుభ్యోన్నమః

# శ్రీ పరాభవ నామ సంవత్సర శ్రీరామనవమి పర్వదినం

## శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుదేవుల సందేశం

శ్రీరామాయణమంతా శ్రీరాముడి జీవనయానం. మనం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని చేసే వైదిక క్రతువులు లోక కళ్యాణం కోసం అయితే, అంతరంగంలో అనుక్షణం సాగే ఆ శ్రీరాముడి యానం తెలుసుకోవడం మనలోపల జరిగే కళ్యాణంగా పరిణమిస్తుంది. ఇలా హృదయంలోపల జరిగే శ్రీరామకళ్యాణం సమస్త జాఢ్యాలను రూపుమాపి మనలోని వైరుధ్యాలనే కాక ప్రపంచంలో జరిగే యుద్ధాలను సయితం రూపుమపగలదు. ప్రస్తుత పరాభవ నామసంవత్సర శ్రీరామ నవమి అలాంటి మైలురాయిగా నిలవబోతుంది. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న అనేక పరిణామాలను చూస్తున్నాం. బయటకు కనపించకుండా చాపకింద నీరులా సాగే పరిణామాలు మరింత తీవ్రంగా మారబోతున్నాయి. 2023 నవంబర్ నుండి



శ్రీగురుధాం ధర్మక్షేత్రంలో శ్రీరామనవమి పర్వదినం (27.03.26, శుక్రవారం)

మొదలైన ఒక అంతర్గత విశ్వప్రణాళిక సకల మానవాళిని ఆ దిశగా నడుపుతూ 2043 ఉగాది నాటికి పూర్తిగా ఈ ప్రపంచం ఒక కొత్తరూపు తీసుకునేలా పరిణమించబోతుంది. ఈ క్రమంలోనే పరాభవ నామసవత్సరం మరో కీలక మలుపుగా నిలిచి రాబోయే 2032 వరకూ తీవ్ర పరిణామాలను సూచిస్తుంది. ఇప్పుడు రాబోయే మార్పు వ్యక్తులకో, వర్గాలకో, మతాలకో, దేశాలకో సంబంధిం చింది కాదు. యావత్ ప్రపంచ మానవాళిలోనూ ఒక సమలమైన పరివర్తన తెచ్చే శుభపరిణామం కాబోతుంది. ఇప్పటివరకూ కేవలం మేధోపరమైన మనసునే ఉపయోగిస్తూ దాన్నే విశ్వసించిన మనిషికి, దానికి మించిన ఉన్నతమైన మనసు పనిచేసే కాలం రాబోతుంది. మనిషి ఏ దేశంలో, మతంలో, సంప్రదాయంలో, విశ్వాసంలో ఉన్నా తన మానవ మేధస్సు యొక్క పరిమితిని గుర్తించి విశ్వమనసుకు తలవంచే ఈ మంచి తరుణం త్వరలోనే చూడబోతున్నాం. అందుకు ఈ ఆరేళ్ల కాలంలో అత్యంత కీలకపరిణామాలు, ఉత్పాతాలు, యుద్ధాలు, ఊహించని తీవ్ర పరిణామాలు, ప్రపంచ వ్యాప్తంగా కొరతలు, కోతలు, వెతలు వంటివి కనిపించవచ్చు. ఇవన్నీ ప్రపంచమానవాళి, ఒకే విశ్వమనసును, గురుతత్త్వాన్ని ఆశ్రయించి కులమతాలకు అతీతమైన సనాతన ధర్మాన్ని అనుసరించే దిశగా పరిణమించ బోతుంది. ఇలాంటి తరుణాన్ని మనం ఎలా వినియోగించుకోవాలో, ఇలాంటి పరిస్థితుల్లో మనముందున్న కర్తవ్యం ఏమిటో తెలుసుకోవడం తెలివైన పని. అందుకు శ్రీరామచంద్రులవారినే ప్రాతిపదికగా తీసుకుందాం. లోకకళ్యాణ క్రతువులతో పాటు మనిషిలోపల జరిగే కళ్యాణం ఎంతగా విస్తరిస్తే మానవాళికి అంత ప్రయోజనం. అందుకు మనం శ్రీరామాయణాన్ని ప్రాతిపదికగా తీసుకుందాం. అది ఏడుకాండాల వాల్మీకి రామాయణాన్ని పోలిన మన ఆత్మరామాయణం. మనమెలకువతో ఆత్మ, శుద్ధ ఎరుకగా ఆరంభమై చైతన్యంగా, మనసుగా, అనుభవంగా, అనుభూతిగా, సంతోషదుఃఖాలుగా పరిణమించి చివరికి నిద్రద్వారా మనం పొందే ఆనందాను భూతిగా సంపూర్ణమయ్యేదే ప్రతివారిలో ఏడుకాండాలుగా జరిగే ఆత్మరామాయణం. అనునిత్యం, అనుక్షణం మనతోనే ఉన్న ఆత్మారాముడిని ఎలా తెలుసుకోవాలో తెలుసుకుంటే ప్రతి హృదయం లోపల శ్రీరామకళ్యాణం జరుగుతుంది. ఆత్మ

ఏడుకాండాలుగా మనలో పరిణమించే తీరును తెలుసుకుంటే మనమెలకువతో పాటు శ్రీరాముడే ముందు వస్తున్నాడని, ఆ తర్వాతే ఆలోచనలతో పాటు మనం వస్తున్నామని అర్థమౌతుంది. శ్రీరాముడు జీవితమంతా మెలకువతోపాటు ముందుగా వచ్చే తెలివిని ఉపయోగిస్తే, మనం తెలివి తర్వాతవచ్చే ఆలోచనతో ఎలా జీవిస్తున్నామో తెలుస్తుంది. రామములక్కాయను సరైన రీతిలో వండినప్పుడే అందులోని దాని అసలు రుచిని తెలుసుకునేవిధంగా కూరను తయారు చేయగలిగినట్లే, జీవితంలో సరైన క్రమత, ధర్మం, నైతికత, కృతజ్ఞతలు ఉంటే మనలోని శ్రీరాముడిని తెలుసుకునే విధంగా జీవనం సాగించవచ్చు. సనాతన ధర్మంతో కూడిన రామరాజ్యం పరిఢవిల్లేందుకు మనస్సు అనుభవాలు, అనుభూతులనే మసాలాలను, ఆశలు, కోరికలు అనే భ్రాంతులను, మత్తు పదార్థంకన్నా ప్రమాదకరమైన భ్రమలను తగ్గించి సరైన పద్ధతిలో చేసే కూరలాగా జీవితం క్రమపద్ధతిలో సాగించటం అలవర్చుకోవాలి. నేడు దేశంలో జరగాల్సిన ధర్మప్రచారం ఇదే. దేవాలయాలు, పూజలు, పునస్కారాలలో కేవలం సంఖ్యాపరమైన పురోగతి మాత్రమే కాకుండా ప్రతిఒక్కరిలో జీవిత విలువలు, జీవనంలో రాముడిని ప్రతిబింబించే పవిత్రత, హృదయంలోని రాముడిని దర్శించే ఆధ్యాత్మికత ఇనుమడించేలా ప్రసారం జరగాలి. అదే మనం భవిష్యత్‌దీతిజిజిలో దర్శించబోయే శ్రీరామరాజ్యస్థాపనకు మన(స్సు)కు మార్గాన్ని సుగమం చేస్తుంది.

---



శ్రీగురుధాం ధర్మక్షేత్రంలో శ్రీరమణభగవాన్ పుణ్యతిథి (14.04.26, మంగళవారం)

# కాలసంకటాలను హరించే హనుమజ్జయంతి

## గెంటేల వెంకట రమణ

శ్లో ॥ బుద్ధిర్బలం యశోధైర్యం  నిర్భయత్వమరోగతా
అజాడ్యం వాక్పటుత్వంచ హనుమత్ స్మరణాద్భవేత్

శ్రీపరాశరసంహితలో శ్రీఆంజనేయ స్వామిచే వధించబడిన కాలనేమి ప్రస్తావన ఉంది. ఈ కాలనేమి మారీచుడి కుమారుడు. శ్రీరామచంద్రుడి సోదరుడైన లక్ష్మణుల వారి రక్షణ కోసం శ్రీఆంజనేయ స్వామి సంజీవినీ పర్వతాన్ని తీసుకొస్తున్న సందర్భంలో స్వామిని ఆటంకపరచడానికి రావణబ్రహ్మ ఆజ్ఞతో నియమించబడి శ్రీఆంజనేయ స్వామివారిచే వధించబడినవాడు.

'కాల' అంటే చీకటి, నలుపు, రాత్రి అని అర్థం. ఇది మాయా, భ్రమ, భ్రాంతికి సంకేతం. కాలనేమి అనగా కాలచక్రం లేదా కాలపరిధి అని, కాలస్వభావంలో వచ్చే మార్పు అని, మధ్యాహ్నపు ప్రకాశం నుండి సాయం చీకటి దిశగా సాగే ప్రయాణమని అర్థం. చీకటి అజ్ఞానానికి సంకేతం. మునుల, మహాత్ముల వేషధారణతో సత్పురుషులుగా నటిస్తూ వంచన చేసే దుష్ట స్వభావానికి కూడా కాలనేమి ప్రతిరూపం. ప్రస్తుత కాలంలో మనకు రెండు రకాల పెను ప్రమాదాలు ఈ కాలనేమి ప్రతినిధులుగా కనిపిస్తున్నాయి. మంచి వారుగా నటిస్తూ మనుషులను చెడు వైపుకు ప్రేరేపించే దుష్టస్వభావం ఒకటైతే, యువతను సత్యం వైపు వెళ్లకుండా అనుకరణ అనుసరణ ఆకర్షణలవైపు మళ్లించే చెడు ప్రభావం మరొకటి. ధర్మానికి గ్లాని కలిగించే ఒక మౌలిక లక్షణమే ప్రస్తుత కాలంలోని కాలనేమి. ఈ దుష్ట గుణాలను సంహరించే జ్ఞాని, భక్త సులభుడు అయిన శ్రీఆంజనేయ స్వామి వారి ప్రార్థనే మనకు తరుణోపాయం. సహజంగానే ఆంజనేయస్వామిని బాల్యం నుండి

అందరం ఇష్టపడి ప్రార్థన చేస్తాం. కాలనేమికి ప్రతిరూపాలైన ఈ దుష్టగుణాలను కూడా సంహరించమని స్వామిని ప్రార్థిస్తే ఈ హనుమజ్జయంతి ఒక వరప్రదాయినిగా పరిణమిస్తుంది. మనసులోని ఈ కాలనేమి సంహారంతోనే ప్రతి మనిషికి విజయం సాధ్యం. శ్రీ ఆంజనేయ స్వామివారిని ప్రార్థంచడం ద్వారా స్వామిలో నెలకొని ఉన్న ధృతి, దృష్టి మతి, దాక్ష్యం అనే చతుర్విధ సులక్షణాలు మనకు అలవడి వారి అనుగ్రహంతో  జీవితం విజయవంతం అవుతుంది. ప్రస్తుత కాలంలో ప్రపంచాన్ని వేధించే ఈ కాలనేమి సమస్యకు పరిష్కారమే మనం జరుపుకునే శ్రీ హనుమజ్జయంతి ఉత్సవం.

కాలనేమి! కాలమననేమి! కాల'మనన'మేమి! కాలనేమి లక్షణాలే ఈ కలికాల లక్షణాలు. మనిషిని సత్యం వైపు వెళ్లకుండా మళ్ళించేదే ఈ కలికాల లక్షణం. అదే నేడు సమాజంలో కనిపించే ఆకర్షణ, అనుకరణ, అనుసరణ, మాయావేషధారణ అనే కాలనేమి ప్రభావం. వాటిని అనుసరిస్తే రావణాసురుని అనుసరించిన కాలనేమిలా నశించిపోతాం. స్వామి దయతో సత్యం వైపు దృష్టి మళ్లిస్తే ధర్మాన్ని అనుసరించిన శ్రీఆంజనేయస్వామిలా చిరంజీవిగా మిగిలిపోతాం. కాలస్మరణ కంటే కాలస్ఫురణ, కాలస్ఫురణకంటే సత్య స్మరణ విశేషమైన ఫలితాన్ని ఇస్తాయని చెప్పేదే ఈ హనుమజ్జయంతి సందేశం. పగటివేళ దివ్య వెలుగుల నుండి అస్తమయం దిశగా సాగే పతనమే కాలనేమి కథ. సత్యం ధర్మం ఎడల లక్ష్యం లేని వారే ఈ చీకటి ప్రయాణానికి ఆకర్షితులవుతారు. శ్రీ హనుమత్ ప్రార్థనతో మనసుకు పట్టిన జాడ్యాలు వదిలి తిరిగి తేజస్సు వైపు మానవ జీవితం సాగాలని ఈ హనుమజ్జయంతి పర్వదినం నాడు స్వామివారిని సంఘటితంగా ప్రార్థిద్దాం.

శ్రీరామ

శ్రీ శివానంద గురుభ్యోన్నమః

శ్రీ ఆంజనేయ పరబ్రహ్మణే నమః

**అతులిత బలధామం స్వర్ణశైలాభదేహం**
**ధనుజవన కృశానాం జ్ఞానినామగ్రగణ్యం**
**సకలగుణనిధానం వానరాణామధీశం**
**రఘుపతిప్రియభక్తం వాతజాతం నమామి**

**యునైటెడ్ కింగ్‌డమ్‌లో నివసిస్తున్న మన భారతీయ సోదర, సోదరీమణులందరికీ హనుమజ్జయంతి పర్వదినం సందర్భంగా హృదయ పూర్వక శుభాభినందనలు.**

భారతీయ సనాతన ధర్మ సంస్కృతి, సంప్రదాయాలకు వేదికగా నిలిచి ఆదరిస్తున్న యూకే దేశపు ప్రజలకు, పాలకులకు మన భారతీయ పౌరుల పక్షాన ధన్యవాదాలు.

వైశాఖమాస కృష్ణదశమిని ఆంజనేయస్వామి జన్మదినంగా పెద్దలు చెప్పిన మాటలను అనుసరించి ప్రతి ఏటా మనం హనుమజ్జయంతిని జరుపుకుంటున్నాం. శ్రీగురుధామ్ ధర్మక్షేత్రానికి వేదిక అయిన బలుసుపాడులో 1981 నుండి మన గురుకుటుంబం ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నది. ఈ యేడాది హనుమత్ జయంతిని నేడు ఇక్కడ యునైటెడ్ కింగ్‌డమ్‌లో మన భారతీయ కుటుంబాల మధ్య ఇలా జరుపుకోవడం ఎంతో సంతోషదాయకం.

శ్రీహనుమాన్ జయంతి అంటే జన్మించిన ఆ తిథిని, ఆ నక్షత్రాన్ని, ఆ వారాన్ని స్ఫురణలో పెట్టుకొని ఈ రోజున భక్తితో మనమంతా ఆంజనేయస్వామిని ఆరాధిస్తున్నాం. ఆ సంఘటన ఇప్పుడు లేకపోయినా శ్రీవారి జన్మదినమునకు ఉన్న ప్రాధాన్యత అటువంటిది. రూపనామ సహితమైన స్వామివారి అరాధనతో పాటు అఖండమైన వారి తత్వాన్ని హనుమజ్జయంతిగా చేసుకోవడం నాకు ఇష్టం. సంప్రదాయంగా భౌతికంగా ఆరాధన చేసుకుంటాం. సాధనగా అంతరంగంలో అనుశీలనచేసుకుంటాం. భక్తులకు ఆనందాన్నిచ్చే అభిషేకం, ఆకుపూజ, సింధూర



శ్రీగురుధాం ధర్మక్షేత్రంలో హనుమజ్జయంతి (ది. 12.05.26, మంగళవారం)

పూజలతోపాటు స్వామివారికి ప్రీతిపాత్రమైన శ్రీసీతారామ కళ్యాణం, శ్రీరామ పట్టాభిషేకం జరుపుకుంటూ మనం హనుమజ్జయంతిని చేసుకుంటున్నాం. ఇంకా ఘనంగా వైదికంగా, శాస్త్రోక్తంగా చేసే వారూ ఉన్నారు. ముఖ్యంగా నా మనసు కోరుకునేది వచ్చిన వారంతా ఆ స్వామి జ్ఞాపకంతో పరవశం చెంది, వారి ప్రసాదం స్వీకరించి వెళ్లాలని. ఆ ప్రసాదానికి, దర్శనానికి, స్పర్శనానికి ఒకానొక అనుగ్రహం మన సనాతన సంప్రదాయంలో తరతరాలుగా ఉంది. స్థూలం నుండి సూక్ష్మానికి ప్రయాణం చేయడమే మన సంప్రదాయం. కాబట్టి ఆ ప్రయాణాన్ని అందరం కలిసి కుటుంబంగా ఉత్సవం చేసుకుంటున్నాం. ప్రేరణ చేసి పెంపొందించేదానికి ఉత్సవం అని పేరు. ఆ స్వామి గుణగణాలను స్మరించడం ద్వారా మనం కూడా అలా జీవించాలనే శుభేచ్ఛతో కూడిన ప్రేరణ కలగటమే ఈ ఉత్సవంలో మనకు కలిగే హనుమజ్జయంతి ఫలం. ఎప్పుడు ఏ సందర్భంలో మనసుకు ఆ శుభేచ్ఛ కలుగుతుందో అదే నిజమైన జన్మదినం... అదే ఉత్సవం... అదే స్వామి జన్మదినోత్సవం. జయంతి అంటే జయం కలిగించేది. మనిషి జీవితాన్ని సార్థకం చేసే అంతిమఫలమే అసలు విజయం. కేవలం పదాల అర్థాలతో, ఫలాలతో కాకుండా పరమార్థాన్ని మనసులో పెట్టుకొని హనుమజ్జయంతిని చేసుకోవాలి. పురాణజ్ఞానం, శాస్త్రజ్ఞానంతో పాటు ఆంజనేయస్వామి తత్వాన్ని అర్థం చేసుకోవడం పారమర్థికతను ప్రసాదిస్తుందని నా ఉద్దేశం.

సద్గురు శ్రీశివానందమూర్తి భగవానుల వారి అనుగ్రహంచేత కలిగిన నా అనుభవంలో ఆంజనేయస్వామి అంటే మన సహజస్వభావమే. అందరిలో ఎరుకగా, గ్రహింపుగా ఏ వస్తువు ఉందో అదే ఆంజనేయస్వామి. ఆంజనేయస్వామి సహా భక్తులు తమ ఇష్టదైవాలను అలా దర్శించుకునే ఆ స్వేచ్ఛే మన సనాతన సంప్రదాయ విశిష్టత. స్వేచ్ఛే మన సనాతన ధర్మం. ఉనికి చైతన్యమై మనసుగా మారి జీవనం సాగుతుంది. ఎరుక (కాన్షియస్‌నెస్) గ్రహింపు (ఎవేర్‌నెస్)గా మారిన తర్వాతే జగత్ జీవుడు ఈశ్వరుడు అనే త్రిపుటి ఏర్పడుతుంది. ఇదంతా వ్యక్తావ్యక్తాలుగా ఉంటుంది. మెలకువ వ్యక్తం. నిద్ర అవ్యక్తం. మెలకువ దీర్ఘ స్వప్నం. స్వప్నం తాత్కాలిక జాగృతి. నిద్ర తాత్కాలిక మరణం. మరణం శాశ్వత నిద్ర. ఇది జ్ఞానులు చెప్పే ఉపదేశం. ఈ విషయ జ్ఞానమే సుందరం, సుమధురం. సుందరుడు అంటే అందగాడని కాదు. అందరివాడు, అందరికీ అందేవాడు అని.

శ్రీఆంజనేయస్వామి రామాయణంలో తన అద్భుతమైన తత్వాన్ని ప్రదర్శించిన కాండకు సుందరాకాండ అని పేరు పెట్టారు. సుందరం అంటే ఆత్మదర్శనం. మనోపవిత్రతతో ఆత్మానందాన్ని పొందిన జ్ఞానే సుందరుడు. జ్ఞానుల్లో అగ్రగణ్యుడైన ఆంజనేయుడే సుందరుడు. ఆ సుందరుడు ఎవరో కారు మన ఎరుక, స్పృహే! సుందరం అంటే జ్ఞానం... కాండం అంటే అంతర్గత ప్రయాణం... అదే ఆధ్యాత్మికమైన సత్యం, శివం సుందరం. అదే జగత్, శివుడు, ఈశ్వరుడన్న త్రిపుటిని అంతం చేసే అద్వైత సిద్ధిగా పరిణమిస్తుంది. పూర్ణమైన మన ఎరుకను మనం గ్రహించడమే హనుమదోపాసన. తనకు తాను అర్థమైనప్పుడు మనసు ఆ సుందరుడైన ఆంజనేయుడిని దర్శిస్తుంది.

ఏకాంతం అంటే మనసులో లవలేశం కూడా కోరిక లేనప్పుడు ఉండే స్థితి. భేదభావం పోయినప్పుడు ఆ మనసుకు కలిగే పవిత్ర స్పర్శ ఏదైతే ఉందో అదే సుందరాకాండగా, రామదర్శనంగా, సీతారామకళ్యాణంగా పరిణమించి హనుమత్ జయంతిగా పరిమళిస్తున్నది. ఇది మహాత్ములు అందించిన జ్ఞాన బోధ. పవిత్రమైన మనసే సీత. మన(సు)కున్న గ్రహింపే శ్రీరాముడు. వివేకంతో మనలోని ఆ

పవిత్రతను తెలుసుకునే అవకాశమే సదా నిలిచి ఉండే చిరంజీవి హనుమంతుడు. ఆలోచనలు అనే లంకను విచారణాగ్నిలో దహించివేస్తే కలిగే జ్ఞానమే సుందరా కాండ. సుందరాకాండ అంటే నన్ను నేను తెలుసుకోవడం. ప్రాపంచిక వ్యవహారాలతో మునిగి, ఫలాపేక్షకై కోరిక కలిగి ప్రవర్తిల్లుతున్న మనసు ఒక్కక్షణం దాన్ని వీడితే అది ఏకాంతమై సుందరమౌతుంది. ఆ క్షణం నుండి మన మనో రామాయణంలో సుందరాకాండ ఆరంభమౌతుంది. అదే మన హృదయంలో హనుమజ్జయంతి అవుతుంది. ఆ క్షణాలు రోజులో అందరూ అనేక పర్యాయాలు దర్శిస్తూనే ఉన్నారు. ఏం చేస్తే ఈ సుందరాకాండ ప్రాప్తిస్తుందో, అందుకు మనమేమి చేయాలో తెలుసుకోవడమే ఇక్కడ హనుమదోపాసన.

శ్రీ ఆంజనేయ స్వామివారు చేసిన నిస్వార్థ సేవకు శ్రీరామచంద్రుల వారే ఆలింగనంతో తమను తాము అర్పించుకున్నారు. ఆ ఆలింగనం అబేధస్థితికి సంకేతం. శివాంశ సంభూతులుగా ఆవిర్భవించి విష్ణు అంశతో ఏకమైన ఒక అద్భుతమైన తత్వమే ఆంజనేయస్వామి. ఆంజనేయస్వామి చిరంజీవి. సుందరకాండను ఈ భావంతో హృదయ పారాయణం చేసిన వారు ఆ పారమ్యంతో జనన మరణాలు లేవని తెలిసి చిరంజీవత్వాన్ని పొందుతారు. ఆలోచనే వ్యక్తా వ్యక్తాలుగా, జనన మరణాలుగా ఉందని తెలిసిన మనసు జనన మరణాలు ఎరుకకు లేవు.... ఎరుకలోకి వచ్చేవాటికే ఉన్నాయని తెలుసుకుంటుంది. ఆ అవగాహనే సుందరాకాండగా హృదయావిష్కృతం అవుతుంది. జనన మరణాలు లేని గ్రహింపే సుందరం. అదే మన ఎరుక. అదే చిరంజీవి తత్వం. అది అనాది, నాది. ఈ సృష్టికి గ్రహింపు, ఎరుక ఉన్నంతకాలం నిలిచి ఉండే చిరంజీవి తత్వమే ఆంజనేయ స్వామి. రూపనామాలకు చిరంజీవిత్వం ఉండదు. రూపనామాలు లేకపోయినా నిలిచి ఉండే గ్రహింపు చిరంజీవిగా ఉంటుంది. అదే అనునిత్యం మనకు నిద్రలో జరుగుతుంది. శాంతిని గ్రహించడానికి రూపనామాలు అవసరం లేదన్న మన సనాతన బోధను ప్రత్యక్షంగా అనుభవించి చూపిన వారు ఆంజనేయస్వామి. రాములవారి నుండే ఏమీ కోరనంత నిష్కామ భక్తి స్వామిది. కేవలం శ్రీరాములవారికే కాదు.... సీతామాతకు, లక్ష్మణులవారికి, భరతులవారికి, సుగ్రీవుడికి, విభీషణుడికి,

చివరికి అసురుడైన రావణాసురుడికి కూడా మేలు చేసిన మహోన్నతుడు స్వామి. నిద్రలో తనకు కావాల్సింది గానీ, పొందవలసిందిగానీ, పోగొట్టుకోవాల్సింది గానీ ఏదీ లేదు. అదే పరమ శాంతి అంటే. రూపనామాలు, భౌతిక ఫలాలపై ఆ శాంతి ఆధారపడదని తెలియడమే హనుమదోపాసన. ఆ స్ఫురణ "సర్వత్రా విజయీభవేత్" అవుతుంది. స్వస్వరూప దర్శనంతో అంతరంగంలో కలిగే ఆత్మజ్ఞానమే నిజమైన విజయం. అది కలిగిన నాడు తన హృదయమే సర్వదేవతా స్వరూపమన్న సత్యం తెలిసి ముక్కోటి దేవతల దర్శన ఫలం దక్కుతుంది. మనసులోని పవిత్రతనే హనుమదోపాసనగా గుర్తించి చేసే సాధనలో సకల దేవతల దర్శనాలు, సకల మంత్రాల సిద్ధి కలుగుతుంది. ఇప్పటికే దేశ విదేశాల్లోని కోట్లాది మందికి స్వామిలీలలు సుపరిచితమే. అంతటి మహత్తరమైన హనుమంతుని ఉపాసనకు అవగాహనను పెంచే అంతరంగ సాధన, అందుకు సహకరించే బాహ్యజీవన సంస్కరణ రెండు రెక్కలుగా నిలుస్తాయి. స్వామి తత్వాన్ని అవగాహన చేసుకోవడంతో పాటు బాహ్య జీవనంలో అనుసరించాల్సిన సాధన ఏమిటంటే.... తల్లిదండ్రుల యందు ఆరాధ్యభావంతో కూడిన చక్కని కుటుంబవ్యవస్థ. మానవజాతికి హితకరమైన పురుషార్థాలను బోధించే చక్కని విద్యావ్యవస్థ. మనసుకు సంఘర్షణ, క్రుంగుబాటు, ఆందోళన కలిగించని చక్కని సామాజిక నిర్మాణం. భారతీయతను ప్రతిబింబించే దేశభక్తి..... ఈ నాల్గింటినీ బోధించే మన సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తే మంచి వ్యక్తిగా, కుటుంబ సభ్యుడిగా, విద్యావంతుడిగా, పౌరుడిగా, దేశభక్తుడిగా మనిషి ఎదగటమే హనుమదోపాసన. అదే సుందరాకాండలోని సీతాన్వేషణలో కనిపించే సముద్ర లంఘనం, మైనాకుడు, సింహిక, సురస, లంకిణీల రూపంలో ఎదురయ్యే ఆటంకాలపై వివేకంతో కూడిన విజయంగా దర్శనమిస్తుంది. లంకాదహనంలో జ్ఞానాగ్నిలో ఆలోచనల దహనం కనిపిస్తుంది. మైనాకుడి విషయంలో వినయం, సురస విషయంలో వివేకం, సింహిక విషయంలో శౌర్యం, లంకిణి విషయంలో చాతుర్యం, సీతామాత వద్ద అప్రమేయ సిద్ధి ప్రదర్శనం, అసుర సంహారంలో పరాక్రమాలను చూపడం ఇదంతా సుందరాకాండలో దర్శనం అవుతుంది. అంతరంగ పవిత్రత, బాహ్యజీవనంలో ధర్మవర్తనం కలిసి

హనుమదోపాసన అవుతంది. స్వామి సాధించిన విజయాలు ధర్మవర్తనానికి ఫలాలైతే, స్వామివారి గుణగణాలు, దైవీగుణాలు అన్నీ ఆ పవిత్రత యొక్క ఫలాలుగా లభించినవే అని మనకు తెలుస్తుంది. ఇదే నా గురుదేవులు నాకు అందించిన అనుభవపూర్వక బోధ కూడా. స్వామివారి ఆకుపూజ అంటే మనసు పండటానికి సంకేతం. అభిషేకం మనశ్శుద్ధికి తార్కాణం. మనో వికారాల హవనమే హోమం. స్వామి భవిష్య బ్రహ్మగా ఉన్నారు. **అహంబ్రహ్మాస్మి! సోహంబ్రహ్మ! అయమాత్మ బ్రహ్మ! ఏకమేవాద్వితీయం బ్రహ్మ!** వంటి మహా వాక్యాలన్నీ (మనో) సుందరాకాండలో మనకు అన్వయం అవుతాయి. మనసు భూతభవిష్యత్‌లవైపు జరుగుతూ ఉంటుంది. కానీ వర్తమానం జరపబడుతుంది. ఆ వర్తమాన క్షణమే సుందరాకాండ. ఆ క్షణాన్ని గుర్తు పట్టడమే హనుమదోపాసన. మహాత్ములు ఆ క్షణాన్ని అందించరు. కానీ మనకు ఆ వీక్షణాన్ని కల్పిస్తారు. ఆ ఒక్క క్షణంలోని వీక్షణమే సుందరం. స్వామి సన్నిధిలో జ్ఞానం కరతలామలకం అవుతుందన్న విశ్వాసమే హనుమదోపాసన. ఏ దేశమేగినా, ఏ సీమలో జీవించినా హృదయంలో పవిత్రభావన కలిగి ఉండటమే మన భారతీయ సనాతన సంస్కృతికి సంకేతం.

ఇంగ్లాండ్ దేశంలో ఇంత వైభవంగా హనుమజ్జయంతి నిర్వహించుకునే ప్రతి హృదయం భారతీయ హృదయమే. ప్రవాస భారతీయులందరిలో ఈ భారతీయ సనాతన ధర్మచింతన ప్రవర్ధమానమై ప్రపంచమంతటా సనాతన ధర్మం విలసిల్లాలని ఈ పవిత్ర పర్వదినం రోజు సకల వర ప్రదాత అయిన ఆంజనేయస్వామిని ప్రార్థన చేద్దాం.

మీ అందరికీ శ్రీఆంజనేయ స్మరణ పూర్వక నమస్కారాలతో

**మీ... గెంటేల వెంకటరమణ**

శ్రీగురుధామ్ ధర్మక్షేత్రం, బలుసుపాడు, జగ్గయ్యపేట మండలం,

ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్

# కాలాతీతస్థితి - ఎరుక

## శివశ్రీ రమణ గురుదేవుల జ్ఞానబోధ

**(శ్రీ జిడ్డు కృష్ణమర్తిగారి జ్ఞానబోధపై శివశ్రీ రమణ గురుదేవులు సోదాహరణంగా అందించిన అమూల్యమైన విచారణా సారాంశం)**

### కాలము మరియు ఎరుక - ప్రాథమిక విచారణ

జీవితంలో మనం నిరంతరం 'కాలము' అనే చక్రంలో తిరుగుతుంటాము. కానీ అసలైన ఆధ్యాత్మికత లేదా జ్ఞానము అంటే కాలాతీతమైన స్థితిని అర్థం చేసుకోవడమే. శ్రీ జిడ్డు కృష్ణమూర్తి గారు తరచుగా ప్రస్తావించే 'కాలరహిత స్థితి' (Timeless state) గురించి మనం విచారణ చేద్దాం. సాధారణంగా మానవుడు తన ఆలోచనల ద్వారా దేన్నైనా గ్రహించాలని చూస్తాడు. కానీ ఆలోచన అనేది స్వతహాగా కాలానికి సంబంధించినది. ఆలోచన ఎప్పటికీ కాలరహితమైన స్థితిని అందుకోలేదు. ఎందుకంటే ఆలోచన పుట్టడమే గతంలోని స్మృతి లేదా భవిష్యత్తులోని ఊహ నుండి జరుగుతుంది.

### గ్రహింపు మరియు గ్రహించబడినది

మనం దేన్నైనా గ్రహించినప్పుడు, అది మనలో ఒక స్మృతిగా మారుతుంది. "గ్రహింపు కాలం కాదు, కానీ గ్రహించిందంతా కాలమే." మనం ఒక వస్తువును చూసినప్పుడు లేదా ఒక అనుభవాన్ని పొందినప్పుడు, ఆ క్షణం దాటిన వెంటనే అది కాలంలోకి (గతంలోకి) వెళ్ళిపోతుంది. ఎరుక (Awareness) అనేది ఎప్పుడూ ఉంటుంది. ఉదయం నిద్రలేచినప్పటి నుండి రాత్రి పడుకునే వరకు మనలో ఉండే ఆ 'మెలుకువ'నే ఎరుక అంటారు. కానీ ఈ ఎరుకలోకి వచ్చే ఘటనలు (Events) కాలానికి సంబంధించినవి. ఎరుక ఒక ఘటన కాదు, అది నిరంతర ప్రవాహం.

## జ్ఞాపకం మరియు జ్ఞానం

జ్ఞాపకాన్ని ఎరుక ద్వారా మనం తెలుసుకోగలం, కానీ జ్ఞాపకం ఎరుకను తెలుసుకోలేదు. ఉదాహరణకు, మీ తండ్రిగారు ఇప్పుడు భౌతికంగా లేకపోయినా మీ స్మృతిలో ఒక జ్ఞాపకంగా ఉన్నారు. ఆ జ్ఞాపకం మీ ఎరుకకు తెలుస్తోంది కానీ, ఆ జ్ఞాపకానికి మీ ఎరుక గురించి తెలియదు. "జ్ఞాపకాన్ని ఎరుక ద్వారా తెలుసుకుంటాం కానీ, జ్ఞాపకంతో ఎరుకను తెలుసుకోవాల్సిన అవసరం లేదని తెలియడమే జ్ఞానము." రూపనామాలు ఉన్నప్పుడు ఎరుక చేసే పనిని 'ఆలోచన' అంటాము. రూపనామాలు లేని స్థితిలో ఉండే ఎరుకే కాలాతీతమైనది.

## ముఖ్య ఉదాహరణలు

నీటి బుడగ : ఒక బుడగను చూస్తున్నప్పుడు మనకు బుడగ మాత్రమే కనిపిస్తుంది. ఆ బుడగను తీసివేసి చూసినప్పుడు మాత్రమే అక్కడ ఉన్నది 'నీరు' అని అర్థమవుతుంది. అలాగే ఆలోచన ఉన్నంత కాలం కాలరహిత స్థితి అర్థం కాదు.

తండ్రి జ్ఞాపకం: గతంలో ఉన్న ఉనికి, ప్రస్తుతం స్మృతిగా మారడం – ఇదంతా కాలమే. అది మీ మనసులో రూపం దిద్దుకున్నప్పుడే కాలం పుడుతుంది.

## కాలరహిత స్థితి – అనుభూతి మరియు ధ్యానము

దైవం అంటే ఎవరు? దైవం కాలాతీతుడు. ఆయన కాలానికి కర్త మరియు స్రష్ట. అందుకే దైవాన్ని కాలంతో (ఉన్నాడు లేదా లేడు అనే ద్వంద్వాలతో) కొలవలేము. కాలము అంటే ఘటనల సమాహారం. మన స్మృతి పథంలో ఏ స్పర్శ అయితే మిగిలి ఉందో దాన్నే మనం కాలము అంటున్నాము. కలల ప్రపంచాన్ని గమనిస్తే, "కలంతా కాలమే, కాలమంతా కలలాంటిదే" అని అర్థమవుతుంది. రూపనామాలు లేని కల ఉండదు, రూపనామాలు లేని అనుభవం ఉండదు.

## అనుభవిస్తున్న క్షణం

శ్రీ కృష్ణమూర్తి గారు చెప్పినట్లు, ఒక విషయాన్ని అనుభవిస్తున్నప్పుడు మాత్రమే

అది కాలరహితంగా ఉంటుంది. అనుభవం పూర్తయి, అది జ్ఞాపకంగా మారిన తర్వాత అది కాలసహితం (Time-bound)అవుతుంది. ఈ 'అనుభవిస్తూ ఉండటం' అనే ప్రక్రియలోనే ధ్యానము, జ్ఞానము మరియు దైవము దాగి ఉన్నాయి. ఆ క్షణం ఎంత గొప్పదంటే, అది ఇంకా ఒక 'క్షణం'గా కూడా రూపుదిద్దుకోలేదు. అది కాలానికి పూర్వ రూపం. ఆ స్థితిలోనే సృష్టి, స్థితి, లయలు అన్నీ ఇమిడి ఉన్నాయి. అదే పూర్ణ జ్ఞానం.

## శూన్యమా? గ్రహింపా?

రూపనామాలు లేకుండా ఎరుక దేన్ని గ్రహిస్తుంది? అది శూన్యం కాదు. అక్కడ కేవలం 'గ్రహింపు' మాత్రమే ఉంటుంది. దీనికి విలువ కట్టలేము. ఎందుకంటే విలువ కట్టడానికి అక్కడ రెండు వస్తువులు (గ్రహించేవాడు, గ్రహింపబడేది) లేవు. ఎరుగుబడేది లేనప్పుడు ఎరుక తనలో తాను ఉంటుంది. అదే అసలైన స్థితి. మనం భవిష్యత్తు గురించి ఆలోచించినా, గత బాధలను తలచుకున్నా అది కాలమే. కాలం అంటే త్రికాలాల(గత, వర్తమాన, భవిష్యత్తు) సముదాయం. కానీ ఈ మూడింటికీ అతీతమైనది ఎరుక.

## ధ్యానం యొక్క ఆరంభం:

ధ్యానానికి ఆరంభం, అంతం కూడా ఆ కాలరహిత స్థితిలోనే ఉంది. వర్తమానం అని మనం దేన్నైతే పిలుస్తున్నామో, అది కూడా ఒక ఘటనగా మారితే అది కాలమే అవుతుంది. కానీ ఘటనగా మారకముందు ఉండే ఆ 'స్పృహ' స్థితి అపూర్వమైనది. ఆధునిక సైన్స్ కూడా విశ్వం అంతా ఒకే బిందువు నుండి వ్యాపిస్తోందని చెబుతోంది. ఆ ఆరంభ బిందువు మీ అంతరంలో ఉన్న కాలరహిత స్థితియే.

## జీవిత పరమార్థం మరియు ముగింపు

జీవితంలో మనం చేసే ప్రతి పని కాలంతో ముడిపడి ఉంటుంది. మనం తీసుకునే ఆహారం, చేసే ప్రయాణం అన్నీ అనుభవాలుగా మారి స్మృతిలో నిక్షిప్తమవుతాయి. ఉదాహరణకు, మీరు తిన్న ఆహారం ఇప్పుడు లేదు, కానీ దాని రుచి జ్ఞాపకంగా ఉంది. ఆ జ్ఞాపకం ఆధారంగానే రేపు మళ్ళీ అదే ఆహారాన్ని

కోరుకుంటారు. అంటే మీరు కాలాన్ని కోరుకుంటున్నారు. మనసు యొక్క మూడు అవస్థలు (జాగృత, స్వప్న, సుషుప్తి) అన్నీ కాలంలోనే ఉన్నాయి. ఈ రహస్యం అర్థం కాకపోతే ఆధ్యాత్మికత బోధపడదు.

## అనుభవించే సమయం

నిద్రలో మనకు కాలం తెలియదు. కానీ నిద్రలేచాక "బాగా నిద్రపట్టింది" అని ఒక ఘటనగా చెబుతాము. అంటే సుషుప్తిలో కూడా ఎరుక ఉంది, కానీ అక్కడ ఘటనలు లేవు. ధ్యానంలో మనం నేర్చుకోవాల్సింది ఇదే. అనుభవిస్తూ ఉన్న సమయంలో, ఆ అనుభవం ఇంకా జ్ఞాపకంగా మారకముందే ఉండే ఆ నిశ్శబ్ద స్థితిని పట్టుకోవాలి. అదే కాలం లేని స్థితి. ఇది మీ స్వరూప జ్ఞానమే.


## శ్రీ కృష్ణమూర్తి గారి సందేశం

"కాలరహితమైనది ఉన్నప్పుడు, దాన్ని తెలుసుకున్నప్పుడే జీవితానికి నిజమైన అర్థం ఉంటుంది." ఆలోచన ద్వారా ప్రయోజనాన్ని ఆశించి చేసేది వ్యాపారం అవుతుంది కానీ జ్ఞానం కాదు. ప్రయోజనం కోసం దైవాన్ని వెతకడం వల్ల 'ఉన్నాడు-లేడు' అనే చర్చలు వస్తాయి. కానీ కాలాన్ని దాటి చూసినప్పుడు ఉన్నది ఒక్కటే గ్రహింపు. ఆ గ్రహింపే నీవు.

## ముగింపు

గ్రహింపు కాలం కాదు, కానీ మనం గ్రహించే వస్తువులన్నీ కాలమే. ఈ సూక్ష్మ భేదాన్ని గుర్తించడమే సాధన. కాలానికి పూర్వ రూపమైన ఆ అపూర్వ క్షణాన్ని అనుభవించడమే ధ్యానం. ఈ అద్భుతమైన జ్ఞానాన్ని అందించిన శ్రీ కృష్ణమూర్తి గారికి, ఈ బోధనను మనకు వివరించిన సద్గురు శ్రీ శివానంద గురుదేవుల పాదపద్మాలకు ప్రణమిల్లుతూ... జీవితాన్ని కాలరహితమైన ఎరుకతో జీవించడానికి ప్రయత్నిద్దాం.

ఓం నమః శ్రీశివానందాయ! భారత్ మాతాకీ జై!




శ్రీగురుధాం ధర్మక్షేత్రానికి బాలక్రీడాకారుల 6కె రన్ (16.05.26, శనివారం)



శ్రీగురుధాం ధర్మక్షేత్రంలో శ్రీశివానందగానజ్ఞానామృత కళావాణి ప్రారంభం
(ది. 08.06.26, సోమవారం)

# అపార్థం, అనుమానం పోతే ఉండేది ఆత్మజ్ఞానమే!

## జ్ఞాన స్వరూపం : అపార్థం

**భగవాన్ శ్రీరమణ మహర్షులవారి బోధనల ఆధారంగా "జ్ఞాన స్వరూపం" గురించి శివశ్రీ రమణ గురుదేవులు అందించిన పరమ అద్భుతమైన ప్రసంగ పాఠం కింద ఇవ్వబడింది.**

సామాన్య జ్ఞానము మరియు అవస్థాత్రయ విచారణ : సాధకులుగా మనందరి మనస్సులలో 'జ్ఞానం' అంటే ఏదో ఒక పరాయి వస్తువు అని, ఎక్కడో హిమాలయాలకో లేదా అడవులకో వెళ్లి కష్టపడి సంపాదించవలసినది అనే ఒక తప్పుడు భావన గూడుకట్టుకుని ఉంది. భక్తులు భగవాన్ రమణ మహర్షుల దగ్గరకు వచ్చి "స్వామీ! జ్ఞాన స్వరూపం అంటే ఏమిటి?" అని ప్రశ్నించినప్పుడు, భగవాన్ దానిని మన దైనందిన జీవిత అనుభవాల ద్వారా చాలా సులభంగా వివరించారు. జ్ఞానం అనేది కొత్తగా వచ్చేది కాదు, అది ఎప్పుడూ ఉండేదే అని నిరూపించడానికి మనకు ప్రతిరోజు అనుభవంలో ఉండే జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు అవస్థలను (అవస్థాత్రయం) రమణ మహర్షులు ప్రాతిపదికగా తీసుకున్నారు.

**జాగ్రదవస్థ (మెలుకువ స్థితి) :** సామాన్య అర్థంలో జ్ఞానము అంటే "నాకు తెలియబడేది, నేను తెలుసుకునేది" అని అర్థం. ఉదయాన్నే మనకు మెలుకువ రాగానే (దీనినే జాగ్రదవస్థ అంటారు) మొట్టమొదటగా మనకు తెలియబడేది ఏమిటి? మన స్థూల శరీరం. ఆ తర్వాత ఈ బాహ్య ప్రపంచం, ఇల్లు, వాకిలి, భార్యాపిల్లలు, దైవము, మరియు రకరకాల అనుభవాలు మనకు తెలుస్తాయి. ఇక్కడ శరీరం మనకు ఎరుకలోకి రావడమే జాగ్రదవస్థకు సంబంధించిన జ్ఞానం. మన కంటికి కనిపించే చెట్టు, పుట్ట, మనుషులు... ఈ ప్రపంచమంతా జ్ఞానమే. ఎందుకంటే అది మనకు 'తెలియబడుతోంది'. కాబట్టి, జాగ్రత్‌లో స్థూల శరీర సంబంధమైన జ్ఞానం వ్యక్తమవుతుంది.

**స్వప్నావస్థ (కలల స్థితి) :** మనం నిద్రపోయినప్పుడు వచ్చేది స్వప్నావస్థ. కలలో ఈ బాహ్య స్థూల శరీరం ఉండదు, బాహ్య ప్రపంచమూ ఉండదు. కానీ అక్కడ మన మనస్సు ఒక సూక్ష్మ శరీరాన్ని, ఒక కొత్త దృశ్య ప్రపంచాన్ని కల్పిస్తుంది. కలలో కూడా మనకు సుఖ:దుఖాలు, భయాలు, ఆనందాలు వంటి ఎన్నో అనుభవాలు, అనుభూతులు కలుగుతాయి. ఉదయం లేవగానే "రాత్రి మా తాతగారు కలలోకి వచ్చారు" అని చెబుతాం. అంటే రాత్రి స్వప్నంలో నీకు కలిగిన ఆ అనుభవమే నీ స్వప్నావస్థా జ్ఞానం. మనస్సు కల్పించే ఈ సూక్ష్మ శరీర సంబంధమైన ఎరుకే స్వప్న జ్ఞానం.

**సుషుప్త్యవస్థ (గాఢ నిద్ర స్థితి) :** ఇక మూడవది సుషుప్తి, అంటే గాఢ నిద్ర. ఈ స్థితిలో జాగ్రత్‌లో ఉండే స్థూల శరీరం ఉండదు, స్వప్నంలో ఉండే మనస్సు లేదా సూక్ష్మ శరీరమూ ఉండదు. ఏ ప్రపంచమూ తెలియదు. నిద్ర లేచాక ఎవరినైనా "రాత్రి నిద్రలో నీకేం తెలిసింది?" అని అడిగితే, వారు "నాకేం తెలియలేదు" అంటారు. శ్రీరమణగురుదేవులు ఇక్కడే ఒక గొప్ప రహస్యాన్ని విప్పారు. ఆ "ఏమీ తెలియకపోవడం" కూడా ఒక జ్ఞానమే! ఏమీ తెలియలేదు అని నువ్వు గుర్తించావు అంటే, అక్కడ ఏమీ లేని స్థితిని నువ్వు తెలుసుకున్నావు అని అర్థం. అంతేకాదు, గాఢ నిద్రలో ఎంతో హాయిగా, ప్రశాంతంగా, ఆనందంగా నిద్రపోయాను అని చెబుతావు. ఈ ప్రశాంతత, ఈ ఆనందమే సుషుప్తిలో ప్రకాశించే జ్ఞానం.

**ఆత్మ అంటే కేంద్రము మరియు అనుమాన నివృత్తి ఆత్మ అంటే ఏమిటి? (కేంద్ర బిందువు) :** సాధారణంగా ఆత్మ అంటే ఏదో కంటికి కనిపించని అద్భుత శక్తి అని భయపడతాం. కానీ శ్రీరమనగురుదేవులు ఆత్మకు ఒక అద్భుతమైన, తేలికైన నిర్వచనం ఇచ్చారు. ఆత్మ అంటే "కేంద్రము" లేదా "హృదయము". దీనిని ఒక క్రమంలో అర్థం చేసుకోవచ్చు: ఈ బాహ్య ప్రపంచ అనుభవాలన్నింటికీ కేంద్రం ఏది? మన దేహం (శరీరం). కాబట్టి ప్రపంచానికి దేహమే ఆత్మ. ఈ దేహానుభవాలకి, ఇంద్రియాల ద్వారా జరిగే అన్ని అనుభూతులకి కేంద్రం ఏది? మనస్సు. కాబట్టి దేహానికి మనస్సే ఆత్మ. ఈ మనస్సుకు, దాని ద్వారా కలిగే

సుఖ:దుఖాలకు, ఆనందానికి, అసలు ఉనికికి కేంద్రం ఏది? అది ఆత్మ వస్తువు. ఏ క్షేత్రంలో అయితే ఈ అనుభవాలు, అనుభూతులు, ఉనికి వ్యక్తమవుతున్నాయో, ఆ ఉత్పత్తి స్థానమే, ఆ కేంద్రమే ఆత్మ.

**సామాన్య జ్ఞానం.... విశేష జ్ఞానం....:** సామాన్య జ్ఞానానికి, ఆత్మజ్ఞానానికి (విశేష జ్ఞానానికి) గల తేడాను గురుదేవులు నీటి ఉదాహరణతో వివరించారు. మీకు దాహం వేసింది, ఎదురుగా నీళ్లు ఉన్నాయి. ఆ నీరు అక్కడ ఉందని తెలియడం సామాన్య జ్ఞానం. నీళ్లు తాగితే దాహం తీరుతుందా లేదా అనే ఒక ప్రశ్న, ఒక అనుమానం లోపల ఉంది. ఎప్పుడైతే నువ్వు ఆ నీటిని తాగుతావో, అప్పుడు నీ దప్పిక తీరి, నీకు ప్రత్యక్ష అనుభవం కలుగుతుంది. నీటి యొక్క నిజమైన లక్షణం నీకు అనుభవపూర్వకంగా బోధపడుతుంది. దీనినే 'విశేష జ్ఞానం' అంటారు.

**ఆత్మజ్ఞానము అంటే ఏమిటి?:** బాహ్య వస్తువుల వైపు నుంచి, వస్తువుల గురించి ఉండే జ్ఞానం వస్తు విజ్ఞానం. అలా కాకుండా, మనకు మనంగా, మన లోపల పుట్టే ప్రశ్నలు, అనుమానాలు తొలగిపోవడాన్ని 'ఆత్మజ్ఞానం' అంటారు. అంటే, ఆత్మ గురించి నీకున్న అనుమానాలన్నీ పటాపంచలై, వచ్చిన యథార్థ సమాధానమే ఆత్మజ్ఞానం. ఈ సృష్టిలో ఆత్మజ్ఞానం లేని వాళ్లంటూ ఎవరూ లేరు. ఎందుకంటే అందరిలోనూ ఆత్మ ఉంది, అందరికీ ఎరుక ఉంది. కానీ దానిపై ఒక అనుమానం కప్పి ఉంది. ఆ అనుమానం తొలగితే ఉన్నది ఉన్నట్లుగా ప్రకాశిస్తుంది. జ్ఞానులు పదే పదే చెప్పేది ఇదే. ఆత్మజ్ఞానం అనేది కొత్తగా సంపాదించేది కాదు; కొత్తగా సంపాదిస్తే అది ఏదో ఒక రోజు పోతుంది. కానీ ఆత్మ ఎప్పుడూ ఉండేది (సనాతనమైనది).

**తురీయావస్థ మరియు పరమార్థ తత్త్వం :** జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు అవస్థల తాత్పర్యమే జ్ఞానం అని తెలుసుకున్నాం. అయితే ఈ మూడు అవస్థల వెనుక, వీటన్నింటికీ సాక్షిగా ఉండే ఒక నాల్గవ స్థితి ఉంది. దానినే 'తురీయావస్థ' లేదా 'క్రియావస్థ' అంటారు. ఈ స్థితిలో సాధకుడు పరమాత్మతో సంపూర్ణ తాదాత్మ్యత

(ఒకటి అయిపోవడం) చెందుతాడు. తన దృష్టితో తాను సారూప్యత పొంది, ఈ జగత్తులో తనకు భిన్నంగా ఏదీ లేదనే పరమ సత్యాన్ని దర్శిస్తాడు. అదే నిజమైన ఆత్మ సాక్షాత్కారం. మన జీవితంలో ఒక స్థితిలో ఉన్నప్పుడు మరొక స్థితి తెలియదు. మనం జాగ్రత్‌దీతిజిజిలో (మెలుకువలో) ఉన్నప్పుడు స్వప్న, సుషుప్తులు తెలియవు. స్వప్నంలో (కలలో) ఉన్నప్పుడు జాగ్రత్ ప్రపంచం గానీ, సుషుప్తి గానీ గుర్తుండవు. సుషుప్తిలో (గాఢ నిద్రలో) ఉన్నప్పుడు స్వప్నము, జాగ్రత్ రెండూ మాయమైపోతాయి. ఈ విధంగా ఏ స్థితిలో ఏది తెలుస్తోందో ఆ తెలిసే గుణమే జ్ఞానం. ఆ తెలిసే జ్ఞాన సముద్రంలో ఇవన్నీ అలల లాంటివి. దీనిని గ్రహించడమే జ్ఞానోదయం.

**ముగింపు - సందేహ నివృత్తి :** ప్రసంగం ముగింపులో ఒక భక్తుడు "స్వామీ! ఆత్మజ్ఞానం ఇంత సింపుల్ గా ఉంటుందా?" అని ఆశ్చర్యంతో వేసిన ప్రశ్నకు గురువుగారు సమాధానిస్తూ ... "అవును, ఇంతకంటే సింపుల్ గానే ఉంటుంది. ఎప్పుడూ ప్రశ్నే చాలా కష్టంగా ఉంటుంది, సమాధానం చాలా సులభంగా ఉంటుంది" అని సెలవిచ్చారు.. ఈ సత్యాన్ని అర్థం చేసుకోవడానికి మనకు పట్టిన సమయాన్నే మనం 'సాధన' అన్నాం. ఒకసారి ఈ యథార్థం అర్థమైతే దానినే 'ఆత్మజ్ఞానం' అంటాం. జ్ఞానం ఎప్పుడూ లోపల ప్రకాశిస్తూనే ఉంది. కేవలం మన అజ్ఞానం వల్ల, అనుమానం వల్ల అది మరుగైంది. ఆ అనుమానం తొలగిపోగానే అజ్ఞానం దూరమవుతుంది. అంతేకానీ ఆత్మజ్ఞానం కలిగినంత మాత్రాన ఈ బాహ్య ప్రపంచం మాయమైపోవడమో, సృష్టి ఆగిపోవడమో జరగదు. మన చూసే దృష్టి మారుతుంది, అంతే!

భగవాన్ రమణ మహర్షులు, సద్గురు శ్రీ శివానంద గురుదేవులు అందించిన ఈ పరమ సులభమైన జ్ఞాన మార్గాన్ని మననం చేసుకుంటూ, వారి పాద పద్మాలకు శతకోటి ప్రణామాలు అర్పిస్తూ... భరతమాతకు జై!

# ప్రశ్నించుకునే విధానం

## అనాత్మ భావన

**శ్రీ నిసర్గదత్త మహారాజ్ బోధనలపై శ్రీరమణగురుదేవులు (ది.17.05.26 ఆదివారం) అందించిన ఈ దివ్యసత్సంగ ప్రవచన సారాంశం, సాధకుడి ఆత్మజ్ఞాన ప్రయాణానికి ఒక దిక్సూచి. ముఖ్యమైన విషయాలు సోదాహరణంగా అందించిన సమగ్ర రూపం ఇక్కడ అందించబడింది.**

జ్ఞానం అనేది మనం బాహ్యంగా సంపాదించేది కాదు, మనల్ని మనం ప్రశ్నించుకునే విధానాన్ని బట్టే మనకు యథార్థ జ్ఞానం సిద్ధిస్తుంది. లోకంలో అందరూ ఆత్మను తెలుసుకోవాలి, ఆత్మజ్ఞానం కావాలి అని ఆరాటపడుతుంటారు. కానీ, భగవాన్ రమణ మహర్షి గాని, సద్గురువులు గాని ఎప్పుడూ 'ఆత్మను తెలుసుకోండి' అని విడిగా చెప్పలేదు. పెద్దలంతా "అనాత్మను తెలుసుకోండి, అనాత్మ భావాన్ని వదులుకోండి" అని చెప్పారు. ఏది నేను కాదో, ఏది శాశ్వతం కాదో తెలుసుకోవడమే అనాత్మ భావనను తెలుసుకోవడం. ఆ అనాత్మ భావన పూర్తిగా తొలగిపోతే మిగిలేదే ఆత్మభావమే. అందుకని ఆత్మజ్ఞానం కోసం విడిగా ఏదేదో చెయ్యక్కర్లేదు, ఏది వదలాలో తెలిస్తే చాలు. జీవితంలో మనం ప్రతిదానికీ వర్రీ అయిపోతుంటాం. "నేను అది చేయాలి, ఇది చేయాలి" అని కర్మల గురించి ఆందోళన చెందుతాం. అందుకే భగవాన్ ఏమన్నారంటే: "మీరు చేయడం గురించి వర్రీ అవ్వకండి. చేయకుండా ఉండవలసింది ఏంటో చూడండి." సాధన అంటే కొత్తగా ఏదో చేయడం కాదు, చేయకూడనిది తెలుసుకొనిప ఆ భ్రాంతిని ఆపడం. ఈ సృష్టిలో ఏది శాశ్వతంగా ఉంటుందని మనం భ్రమపడుతున్నామో, ఒకరోజు అది ఉండదు అని మనకు కనువిప్పు కలుగుతుంది. దీనిని మనకు వేరే ఎవ్వరూ నేర్పక్కర్లేదు, మన జీవితమే నేర్పుతుంది. అందుకే జీవితానికి మించిన గురువు లేదు, జీవితమే అత్యంత సమీపమైన దైవము. జీవితంలో వచ్చే అనుభవాలను

లోతుగా గమనిస్తే సంతోషం, దుఃఖం అనేవి కాలంతో పాటు కదిలిపోయే ఘటనలే అని అర్థమవుతుంది. లోకంలో మనుషులు ఎన్నో రకాల సంతోషాలను కోరుకుంటారు. మంచి బట్టలు, పెద్ద ఇల్లు, ఖరీదైన నగలు, బంధువులు, స్నేహితులు, కీర్తి ప్రతిష్టలు. ఒకదాని నుంచి వచ్చిన సంతోషం జీవితానికి పూర్తిగా సరిపోతే, మనిషి ఇంకొక దాన్ని ఎందుకు కోరుకుంటాడు? ఒక నగ కొనుక్కున్నప్పుడు కలిగే తృప్తి, కొద్దిరోజుల్లోనే ఇంకొక కొత్త మోడల్ చూడగానే ఎందుకు మారిపోతుంది? దీనిని బట్టే అర్థం చేసుకోవాలి.... బాహ్య వస్తువులలో ఉన్న సంతోషం తాత్కాలికం అని. మనం ఊరు వెళ్లేప్పుడు వెంటపడ్డ పిల్లలను మభ్యపెట్టడానికి "రేపు సినిమా తీసుకెళ్తా, ఐస్‌దీతిజిజిక్రీమ్ కొనిస్తా" అని అబద్ధాలు చెబితే వాళ్ళు అప్పటికప్పుడు ఏడుపు ఆపేసి సంతోషపడతారు. కానీ మనం చెప్పులు వేసుకుని బయటకు నడవగానే మళ్ళీ ఏడవడం మొదలుపెడతారు. మన మనసు కూడా ఆ చిన్నపిల్లాడి లాంటిదే. బాహ్య వస్తువుల వైపు ధ్యాస ఉన్నంతసేపు సంతోషంగా ఉన్నట్టు నటిస్తుంది, అది దూరం కాగానే దుఃఖిస్తుంది. ఈ సంతోషాలు, దుఃఖాలు కాలంతో పాటు, ఘటనలతో పాటు కదిలి వెళ్ళిపోతున్నాయి. ఏదీ స్థిరంగా ఉండటం లేదు. ఈ నిజాన్ని గుర్తుపట్టడమే అనాత్మ భావనను వీడటం. దీనికోసం అడవులకు వెళ్ళిపోవక్కర్లేదు, సర్వస్వం వదిలేయక్కర్లేదు. మీరు వదిలిపెట్టకపోయినా, ఒకరోజు అవే మిమ్మల్ని వదిలిపెడతాయి; లేదా వాటిని వదిలి మీరు వెళ్ళిపోతారు. ఈ ఒక్క స్పృహ అంతరంలో నిలవడమే స్వరూప జ్ఞానంగా మారుతుంది. తృప్తి అనేది బయట దొరికేది కాదు, అది స్వరూప జ్ఞానం వల్ల కలిగే సహజ ఆనందం. ఈ క్షణాన్ని, ఈ అమృత గడియను వదులుకోకుండా అవగాహన చేసుకోవడమే నిజమైన సాధన.

## నేను ఎవరో తెలుసుకోవడం - చైతన్య లీల

సంతోషం అనేది వస్తువులో ఉందా, మనలో ఉందా అని విచారణ చేయాలి. ఉదాహరణకు, మీరు ఎంతో ఇష్టపడి ఒక వజ్రాల హారం కొనుక్కున్నారు, ఎంతో సంతోషపడ్డారు. కానీ అదే సమయంలో ఇంట్లో మీ బిడ్డకు తీవ్రమైన అనారోగ్యం

చేసి హాస్పిటల్లో చేర్చాల్సి వచ్చింది. మరి ఆ సమయంలో ఆ వజ్రాల హారం మిమ్మల్ని సంతోష పెట్టగలుగుతుందా? లేదు. ఒకవేళ సంతోషం ఆ నగలోనే ఉంటే, బిడ్డకు ఒంట్లో బాగోలేకపోయినా ఆ నగను చూడగానే సంతోషం కలగాలి కదా! అంటే సంతోషం ఆ నగలో లేదు, ఆ క్షణంలో మీ మనసులో కలిగిన ఒక భావన మాత్రమే. ఇంకొక ఉదాహరణ: ఒకాయన ఎంతో ముచ్చటపడి ఖరీదైన కారు కొనుక్కున్నాడు. ఇంట్లో వాళ్ళు ఎంతో సంతోసపడతారు. కారులో ఇంటికి వెళ్తుండగా ప్రమాదం జరిగి ఆ యజమాని చనిపోతే ఇప్పుడు కారు అలాగే ఉంది, కానీ అక్కడ సంతోషం ఉందా? లేదు, మహా దుఃఖంగా ఉంటుంది. కారుతోనే సంతోషం వస్తే, కారు ఉన్నంతకాలం సంతోషం ఉండాలి కదా! కాబట్టి బాహ్య ప్రపంచంలోని వస్తువులు, పదవులు ఏవీ మనకు శాశ్వత ఆనందాన్ని ఇవ్వలేవు. ంతో పాటు ప్రతిదీ కదిలిపోతుందని గ్రహించినప్పుడు అంతరంలో ఒక నిశ్చింత, వైరాగ్యం ఉదయిస్తాయి. ఆ శాంతి పేరే ఆత్మజ్ఞానం. జీవితంలో రోగాలు రావడం, మందులు వాడితే తగ్గడం, మళ్ళీ ఇంకోటి రావడం సహజం. ఈ తాపత్రయాలన్నీ చూసి, విసిగిపోయి ఒకానొక దశలో మనిషి “నేను పోతే బాగుండు, ఈ బాధలన్నీ తప్పుతాయి” అనుకుంటాడు. అలా “నేను పోతే బాగుండు” అనిపించడమే “నేను ఎవరిని?” అనే ప్రశ్న పుట్టడానికి మూలం. నేను పోవడం అంటే శరీరం చనిపోవడం కాదు. నిద్రపోయేటప్పుడు మనకు ఏ బాధా తెలియదు, ఏ సుఖమూ తెలియదు, నా భార్య, నా పిల్లలు అనే బంధాలూ తెలియవు. అయినా నిద్రలో మనం పరమ సుఖంగా ఉంటాం. ఆ నిద్రలోని సుఖం తాత్కాలికం, కానీ మేల్కొని ఉన్నప్పుడే ఆ స్థితిని అవగాహన చేసుకోవడం శాశ్వతం. మనం ఉదయం లేవగానే ఏం జరుగుతుందో గమనించాలి. గాఢనిద్ర నుంచి మెలుకువ రాగానే మొదటి క్షణంలో మనం కేవల దైవ స్వరూపంగా, నిర్మల చైతన్యంగా ఉంటాం. ఆ తర్వాతే “నేను ఫలానా వ్యక్తిని” అనే అహంకారం మేల్కొంటుంది. ఆ మరుక్షణమే నా భార్య, నా పిల్లలు, నా ఇల్లు, మంచం, కంచం అంటూ మనతో అనుబంధం ఉన్న ప్రతి వస్తువుగా మన చైతన్యమే విస్తరిస్తుంది. ఇదంతా నా చైతన్య లీల అని తెలియక, “నేను చూస్తున్నాను, నేను అనుభవిస్తున్నాను” అనే భ్రమలో పడి జన్మలు

నెట్టుకొస్తుంటాం. వాస్తవానికి ఇదంతా మీకన్నా వేరు కాదు. పొద్దున మన మెలుకువ, మన జననం, మన జీవితం ఒక మహా యోగం. ఈ జీవితాన్ని మిస్ అవ్వకండి. దేనినీ ద్వేషించి వదిలిపెట్టాల్సిన అవసరం లేదు. మీ భార్యాభర్తలను ప్రేమించండి, తల్లిదండ్రులను ప్రార్థించండి. భారతీయత అంటే ఇదే. నీ చొక్కా, నీ దువ్వెన, నీ తల్లి, నీ చుట్టూ ఉన్న ప్రపంచం అంతా ఆ దైవ చైతన్యమే అని చూడటమే సనాతన ధర్మం. సమస్తం నీలోనే ఉంది, నీవే సమస్తంగా మారావు అనే సత్యాన్ని జీవించడమే పరమార్థం.

## ధ్యానరహస్యం


శ్రీనిసర్గదత్త మహారాజ్ తమ నిరూపణల్లోని 124వ అధ్యాయంలో ఒక అద్భుతమైన సత్యాన్ని చెప్పారు: “నీవు గొప్ప గొప్ప సౌఖ్యములు అనుభవించవచ్చు, జప తపస్సులు చేయవచ్చు. కానీ నిన్ను అన్య అనుభవాల నుండి స్వేచ్ఛ నొందించేది కేవలం నీ చైతన్యమే.” మనం చేసే పూజలు, జపాలు, తపస్సులు అన్నీ ఒక స్థాయి వరకే ఉపయోగపడతాయి. అసలైన విముక్తిని ఇచ్చేది మన అంతర్గత చైతన్య అవగాహన మాత్రమే. సాధారణంగా మనం ఒక విగ్రహంపై ధ్యానం ఎలా చేస్తామో మహారాజ్ వివరించారు. మొదట మనం కళ్ళు తెరిచి ఎదురుగా ఉన్న విగ్రహాన్ని లేదా గురువు రూపాన్ని చూస్తాం. ఆ తర్వాత కళ్ళు మూసుకుని మనసులో ఆ రూపాన్ని ఊహిస్తాం. అంటే మన చైతన్యమును పరోక్షముగా దాని వైపునకు మళ్ళిస్తాం. అప్పుడు ఆ మూర్తి యొక్క చిత్రం ధ్యానము చేయువానిలోనికి దిగుతుంది. అంటే అది జ్ఞాపకంగా మారుతుంది. ఆ జ్ఞాపకంపై ఏకాగ్రత నిలిపినప్పుడు, ఆ రూపమే దేవతా రూపమును ధరిస్తుంది. కానీ అసలు రహస్యం ఏంటంట ఆ దేవతా రూపం ఎక్కడో లేదు, అది నీ చైతన్యము నందే సృష్టించబడినది. దీనిని అర్థం చేసుకోవడానికి ఒక లౌకిక ఉదాహరణ: మనం ఒక అమ్మాయిని లేదా అబ్బాయిని ప్రేమించినప్పుడు, వారిని మనసులో ఊహించుకుని సంతోషపడతాం. కానీ ఆ ఊహ కలగడానికి ముందు వారిని చూసి ఉండాలి కదా! అలాగే ధ్యానంలో కూడా ఒక రూపం మనసులో ముద్రించబడాలి. మీరు చూసిన రాముడు లేదా కృష్ణుడు మీ మనసులోనే తయారయ్యారు. ఆ రాముడు

ఎవరో కాదు, నీ చైతన్యమే ఆ రూపం పొందింది. ఆ పైన నీవే ఇంకొక భావంతో దానిని ప్రార్థిస్తున్నావు. ఈ ప్రాసెస్ అంతా ఎలా జరుగుతుందో తెలుసుకోవడమే నిజమైన ధ్యానం. ధ్యానం అంటే కేవలం గంటల తరబడి కళ్ళు మూసుకుని కూర్చునే ప్రక్రియ కాదు. ప్రక్రియ కంటే కూడా అందులో జరిగే 'అవగాహన' ముఖ్యమైనది. వంట చేయడం అంటే గిన్నె పెట్టడం, నూనె వేయడం, కూరగాయలు కోయడం అనే విధానం మాత్రమే కాదు; అంతా అయ్యాక పొందే రుచి, ఆస్వాదనే అసలైన వంట. అలాగే ధ్యానంలో కూడా చివరికి మిగిలే నిశ్శబ్ద అవగాహనే ముఖ్యం. వాస్తవంగా ఇక్కడ జరిగే యోగ రహస్యం ఏంటంటే---మీరు నన్ను చూస్తున్నారు అంటే, మీ మనసే నా రూపాన్ని తీసుకుంది. ఇప్పుడు మీ మనసు నా రూపం అవ్వడం చేత, మీరే నేనయ్యారు. ఎప్పుడైతే ఈ ఏకత్వం సిద్ధిస్తుందో, అప్పుడు గురువు యొక్క జ్ఞానము, మౌనము, ధ్యానము మీ సొంతం అవుతాయి. సృష్టిలో సృష్టికర్త, సృష్టి, చూసేవాడు, చూడబడేది అంతా ఒక్కటే చైతన్యం. ఈ సత్యాన్ని ప్రాణము, శరీరము ఉండగానే కనుగొనవలెను.

## గురుభక్తి - సమర్పణ భావం

చైతన్యమును అవగాహన చేసుకోవాలంటే గురువుగారి యెడల పరమ భక్తి అవసరం. గురువు అంటే కేవలం ఒక శరీరం కాదు, ఒక వ్యక్తి కాదు; అదొక అనంత తత్వం. గురువును ఒక వ్యక్తిగా చూస్తే మనమూ వ్యక్తిగానే మిగిలిపోతాం. మిమ్మల్ని మీరు ఒక తత్వంగా చూసుకున్నప్పుడే, గురువు కూడా తత్వంగా దర్శనమిస్తాడు. గురువుకు బందీ అవ్వడం అంటే సత్యానికి బందీ అవ్వడం, వ్యక్తిత్వానికి కాదు. ఈ అవగాహన కలగడానికి అంత:కరణ శుద్ధి, వినయం చాలా అవసరం. మన పదవులు, మన లౌకిక విజ్ఞానం దైవమార్గంలో దేనికీ పనికిరావు. ఒక మనిషికి తీవ్రమైన దాహం వేసినప్పుడు నీటి కోసం ఎంతలా తపన పడతాడో, ఆత్మజ్ఞానం కోసం అంతటి తపన ఉండాలి. శ్రీ రామకృష్ణ పరమహంస వివేకానందుడికి దైవదర్శనం చేయించడానికి ఆయన తలను నీటిలో ముంచి పట్టుకున్నారు. ఊపిరాడక వివేకానందుడు ఎంతలా బయటకు రావాలని పోరాడాడో, అంతటి తపన ఉంటేనే దైవం సాక్షాత్కరిస్తాడు. మన అజ్ఞానం వల్లనే

మనకు ఇంట్లో భార్య, పిల్లలు, మంచం, పరుపు అన్నీ వేర్వేరుగా కనిపిస్తున్నాయి. కానీ వాస్తవానికి నువ్వు తప్ప ఇక్కడ ఇంకెవరూ లేరు. నువ్వే ఇంతమందివి అయ్యావు. ఈ సత్యాన్ని ఒప్పుకోవడానికి అహంకారం అడ్డుపడుతుంది. నిద్ర, ఆకలి, దప్పిక, తీర్చే జాగ్రదావస్థ అన్నీ చైతన్యంలో వచ్చే లీలలు మాత్రమే. మొదట నుండి చివరి వరకు అంతా లీలయే. నువ్వే లీలవు, నువ్వే కృష్ణుడివి, నువ్వే రాధవు, నీ చుట్టూ ఉన్నదంతా బృందావనమే. ఒక కాగితం మీద "నేను -- నా అనుభవమంతా నా లీలయే" అని రాసి మీ ఇంట్లో పెట్టుకోండి. ప్రతిరోజూ పొద్దునే నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు మీకు ఎదురయ్యే ప్రతి అనుభవము---మీ భార్య, మీ పిల్లలు, మీ కష్టాలు, సంతోషాలు, చివరికి ఈ సత్సంగం వినడం కూడా మీ లీలయే అని గుర్తుంచుకోండి. నీవు సత్యము, శాశ్వతము మరియు ఉనికి యొక్క అన్ని దశలకు అతీతమైన పరబ్రహ్మ స్వరూపానివి. బాహ్యమైన మాయలో పడకుండా, ప్రాణముండగానే ఈ అమృత గడియను సద్వినియోగం చేసుకోండి. గురువును నమ్మండి, మీ అంతరంలో ఉన్న చైతన్యాన్ని నమ్మండి. సమస్తము ఆ శివస్వరూపమే అని శరణాగతి పొందండి.



శ్రీగురుధామ్ ధర్మక్షేత్రంలో
సత్య అన్నపూర్ణ ప్రసాద భవనం ప్రారంభం




కోదాడ హిందుసమ్మేళనంలో పాల్గొన్న శివశ్రీ రమణ గురుదంపతులు
(19.04.26, శనివారం)




సూర్యాపేటలో మాధవనిలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న
శివశ్రీ రమణ గురుదంపతులు (27.04.26, సోమవారం)

# మూడు అక్షరాల కోరిక మూడు విభజనలు తెస్తుంది

మనసు కదలిక సాత్వికమైతే అది అవసరంగానూ, తామసరాజస గుణాలతో ఉంటే అది కోరికగానూ పరిణమిస్తుంది. ఒక వ్యక్తి పదే పదే ఒక వైపుచూస్తుంటే... ఆ చూచేవాడు "కోరిక" అని గుర్తుపట్టకుండా... విషయంలో తాను ఒకటవుతాడు. అదే గమనించిన వాడికి తెలుసు అతను కోరికతో చూస్తున్నాడని. అతను కోరిక అనే పేరు పెట్టకుండా 'ఎందుకు అట్లా చూడటం అని అడుగుతారు'. అదే జ్ఞాని అయితే... విషయం లౌకికమైనా, ఆధ్యాత్మికమైనా కోరికను ప్రస్తావించకుండా "చూచేవాడిని చూడమని" అంటారు. అంటే దాని అర్థం 'ఆ కదలిక కోరిక వల్లనే' అనే. మనసు వస్తు ప్రపంచంతో గానీ, దైవంతో గానీ సంబంధం పెట్టుకోవడం కోరిక పనే. అందుకని జ్ఞాని కోరిక అనే పదం వాడడుకానీ 'చూసేవాడు' అనే దాని అర్థం కోరిక అనే. అంటే కదలికకు కారణమైన కోరికను చూడమనే. విషయంలో మనకి కారణంగా కనబడుతున్నది కోరిక మాత్రమే. కొరికే చూచేవాడనీ, చూడబడేదనీ విభజన తీసుకు వస్తుంది.. ఉదాహరణకు జపించే మంత్రం, మంత్రం జపించాలన్న కోరిక రెండూ మనసే. అలానే మనసులోని రూపం విషయంలో కూడా అంతే. మనసు, మంత్రం వేరు కాదు. మనసు రూపం వేరుకాదు. వాస్తవానికి రెంటిమధ్య భేదం లేకపోయినా వాటి మధ్య విభజన ఉన్నట్లు అనిపిస్తుంది. ఆధ్యాత్మికమైనా లౌకికమైనా మనసులో ఒక రూపాన్ని చూస్తున్నప్పుడు నిజంగా ఆ దృశ్యం మనసుకు వేరుగా లేదు. కానీ నేను దృశ్యాన్ని చూస్తున్నాను అనుకుంటుంది. అంటే మనసును దృశ్యాన్ని వేరు చేస్తుంది. కోరిక మనసును – మనసులోని విషయాన్ని రీచీజిరిశి చేస్తుంది. ఇది కోరిక యొక్క మూల లక్షణం. ఊహాచిత్రం ఏదైనా అది మనసుకు భిన్నంగా లేదు. కానీ కోరిక ఆ ఊహా చిత్రాన్ని సృష్టించడమే కాక వేరుగా చూపిస్తుంది. ఇక్కడ కోరిక చూసేవాడుగా మారుపేరుతో పిలవబడుతుంది. ఆధ్యాత్మిక లౌకిక జీవనాల్లో అదే పేరు మార్చుకొని చూసేవాడిగా నిరంతరం కొనసాగుతూ గుర్తు పట్టకుండా ఉంటుంది. అదే ముఖ్యమైన భ్రమకు కారణం. ఇక్కడ మనసు, కోరిక అనే పేర్లతో కాక చూచేవాడిగా పేరు మార్చుకొని కొనసాగుతుంది. అదే బలపడి అన్నిటికీ అది ముఖ్యమైన కర్తగా రకరకాల పేర్లతో కొనసాగుతుంది. నిజంగా దానికి ఉనికి లేకపోయినా అర్థం చేసుకునేంతవరకు అది కొనసాగుతూనే ఉంటుంది. అర్థం చేసుకుంటే అదే జ్ఞానంగా పరిణిస్తుంది. అమ్మ గుర్తుకు రావటంలోనూ, అమ్మని చూడాలని భావంలోనూ వచ్చే ఊహ చిత్రంలో నేను చూసేవాడిని అమ్మ చూడబడేది అయిపోయింది. ఇందాక మనసు కానీ మంత్రం లేదు. ఇక్కడ అమ్మ, అమ్మని చూసిన మనసు వేరుగా లేవు. అక్కడ ఆ ఊహ చిత్రాలు లేకపోతే మనసు కూడా ఉండదు. దృశ్యం లేకపోతే అది ఎరుక గానే ఉంటుంది. కోరిక ఊహ చిత్రాన్ని తీసుకొచ్చి మనసైంది. మనసు దృశ్యమైంది. కోరిక చూసేవాడైంది. చూసేవాడు లేడు, అది కేవలం కోరిక యొక్క ప్రతిక్రియ అని అర్థం అయితే ఊహ చిత్రం అదృశ్యమై మనసు స్థానంలో ఎరుక ఉంటుంది. మనసు అర్థమై స్వరూప జ్ఞానంగాను. కోరిక అర్థమై జ్ఞానం గాను రూపుదిద్దుకుంటుంది. చూసేవాడు లేకపోతే విభజన లేదన్న జ్ఞానం కలుగుతుంది. దీనిని మనం గమనించలేమా! సాత్వికతలో మనసు సమతుల్యత, సంయమనం కలిగి సామరస్యంగా ఉంటుంది. సత్యాన్ని గమనించగలుగుతుంది. రాజసతామస గుణాలతో ఉన్న మనసు విపరీత ధోరణితో ఉంటుంది. మరింత భ్రమలోకి జారిపోతుంది. కోరిక అంటే మనసు స్వరూపాన్ని వీడి అనుభవం వైపు కదలడం. మనం చేయాల్సింది దీన్ని (కోరికను) అదిగమించటం కాదు అది 'గమనించడం' ద్వారా అర్థం చేసుకోవడం. అప్పుడే స్వరూప జ్ఞానం సాధ్యం అవుతుంది. అదే విచారణమార్గం.

## ఓం నమో భగవతే శ్రీశివానందాయ

నమస్తే పద్మనాభాయ నమో హృత్పద్మవాసినే ।
పద్మాసనస్థదేవాయ శివానందాయ తే నమః ॥

నమశ్శివానంద నమో యతీంద్ర
సన్మార్గదర్శిన్ మమ దేశికేంద్ర ।
నమామ్యహం త్వచ్చరణారవిందౌ
కృపాకటాక్షం కురు దేవ నిత్యమ్ ॥

శరీరం త్వదీయం మనోపి త్వదీయం
ఆత్మా త్వదీయం చ ప్రాణస్త్వదీయః ।
సర్వం త్వదీయం మదీయం న కించిత్
శివానంద మే దేహి హస్తావలంబమ్ ॥

శివానందనామామృతానందవృత్తిః
శివానందపాదారవిందానురక్తిః ।
శివానందసేవాపరత్వం హి దేహి
శివానంద మే జన్మజన్మాంతరేపి ॥

రమణీయ వపుర్దేవం
రమణీయసమాశ్రితమ్ ।
రమణీయం శివానంద
రమణం ప్రణమామ్యహమ్ ॥

ఓం నమో భగవతే శ్రీశివానందాయ

# దేశభక్తి ప్రార్థన

హే ఈశ్వరా ! ధర్మస్వరూపుడవై
అణువణువులో నీవే నిండి ఉన్న
నా మాతృదేశాన్ని
సుఖశాంతులతో,
బహుముఖ సంపదలతో,
ధర్మంలో వర్ధిల్లేలా
దీవించు తండ్రి !



సర్వేజనాః సుజనో భవంతు!
సర్వే సుజనాః సుఖినోభవంతు!
భరతభూమీ సుఖీభవతు!
లోకాః సమస్థాః సుఖినోభవంతు!
జై భరతమాత! జై జై భరతమాత!!

అనునిత్యం దేశక్షేమం కోసం చేసే, ఈ రెండు నిమిషాల ప్రార్థన మన సమాజ ఋణాన్ని తీర్చి యోగక్షేమాలను అందిస్తుంది.

– సద్గురు శ్రీ శివానందమూర్తి భగవానులు

శ్రీ గురుధామ్ ధర్మక్షేత్రం, బలుసుపాడు,
జగ్గయ్యపేట మండం,
ఎన్టీఆర్ జిల్లా, ఆం.ప్ర.